
JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 06-07-2026
Medchal - Malkajgiri । Monday 06-07-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 35
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 35 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com



# కేంద్రానికి సీఎం రేవంత్ లేఖ
## కీలక అంశాల ప్రస్తావన..!!

జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ II విస్తరణకు అనుమతులు మంజూరు చేయడంతో పాటు, మెట్రో ఫేజ్ Iను తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులకు లేఖలు రాశారు. ఈ మేరకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి విడివిడిగా లేఖలు పంపారు. ఇటీవల 2026 జూన్ 23, 24 తేదీలలో కేంద్ర మంత్రులతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశాల్లో తీసుకున్న కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల ప్రకారం మెట్రో ఫేజ్ I ఆస్తుల విలువను నిర్ధారించడం, అధిక వడ్డీ రుణాల పునర్వ్యవస్థీకరణ బాధ్యతలతో పాటు, ఫేజ్ II విస్తరణకు అవసరమైన దీర్ఘకాలిక ఆర్థిక వనరుల సమీకరణపై సమగ్ర అధ్యయనం నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ అయిన ఎస్‌బీఐ క్యాప్స్ ను నియమించాలని ఉమ్మడిగా అంగీకరించిన విషయాన్ని ప్రస్తావించారు. అయితే, ఈ విషయంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ను ఖరారు చేయకపోవడం, ఎస్‌బీఐ క్యాప్స్‌కు అధికారికంగా బాధ్యతలు అప్పగించడంలో జాప్యం జరగడంపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జాప్యం వల్ల హైదరాబాద్ మెట్రో ఫేజ్ I నిర్వహణలో రోజువారీ ఇబ్బందులు, అనిశ్చితి ఎదురవుతున్నాయని, అలాగే ఫేజ్ II డీపీఆర్‌ల ఆమోదం, నిధుల సమీకరణ ప్రక్రియలు ఆలస్యమవుతున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఫలితంగా ప్రాజెక్టు అమలు మరింత వాయిదా పడటంతో పాటు వ్యయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. హైదరాబాద్ భవిష్యత్ ప్రజా రవాణా అవసరాలకు అత్యంత కీలకమైన మెట్రో ఫేజ్ II విస్తరణ పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం కాకూడదని పేర్కొన్న ముఖ్యమంత్రి, ఈ విషయంలో ఇద్దరు కేంద్ర మంత్రులు వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని ఎస్‌బీఐ క్యాప్స్ నియామక ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని కోరారు. తద్వారా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య తీసుకున్న నిర్ణయాలు వేగంగా అమలై, మెట్రో ఫేజ్ I స్వాధీనం ప్రక్రియ పూర్తికావడంతో పాటు ఫేజ్ II మెట్రో పనులు ఎలాంటి జాప్యం లేకుండా ముందుకు సాగేందుకు వీలుకలుగుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రశాంత్ కిశోర్ బిగ్ స్టేట్ మెంట్



- బీజేపీ జాతీయ అధ్యక్షుడి సీటులో..
- ఇలాంటి స్థానంలో ప్రశాంత్ కిషోర్ ఎలా నెగ్గుకొస్తారనేది చర్చనీయాంశమైంది

జయభేరి, బీహార్ :

ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ స్వయంగా ప్రత్యక్ష ఎన్నికల రంగంలోకి దిగుతున్నారు. బీహార్ లోని ప్రతిష్టాత్మకమైన పాట్నా బాంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో ఆయన పోటీ చేయబోతున్నారు. ఈ నిర్ణయాన్ని జన్ సూరాజ్ పార్టీ చీఫ్ మనోజ్ భారతి వెల్లడించారు. కొద్దిసేపటి కిందటే పాట్నాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రశాంత్ కిశోర్ తో కలిసి మాట్లాడారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన నితిన్ నబీన్ తన అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ బాంకీపూర్ స్థానం ఖాళీ అయింది. ప్రస్తుతం ఆయన రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ ఉప ఎన్నికకు సంబంధించి ఈ నెల 30వ తేదీన పోలింగ్ జరగనుంది. ఆగస్టు 3వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. నితిన్ నబీన్ రాజీనామాతో బాంకీపూర్ రాజకీయ పరిణామాలు శరవేగంగా మారాయి. ఇది బీజేపీకి కంచుకోట. ఇలాంటి స్థానంలో ప్రశాంత్ కిషోర్

...మిగతాది 2 లో



# కొత్త కోల్ బ్లాక్స్ లేకుండా కొత్త థర్మల్ ప్రాజెక్టులు

- ఇదేనా బీఆర్ఎస్ విజన్..

జయభేరి, హైదరాబాద్ :

నేను కేసీఆర్ ని, హరీశ్ రావుని, కేటీఆర్ ని సూటిగా అడుగుతున్నాను. 2014 నుంచి 2023 వరకు పదేళ్లు మీరు అధికారంలో ఉన్నారు. ఆ పదేళ్లలో సింగరేణికి సంబంధించి కొత్త కోల్ బ్లాక్స్ ఏమన్నా తీసుకొచ్చారా? ఉన్న థర్మల్ పవర్ ప్రాజెక్టులకు సరిపడేలా అదనంగా కోల్ బ్లాక్స్ జోడించారా? పాత బ్లాకుల్లో కొన్ని బొగ్గు అయిపోయి మూసివేయాల్సిన పరిస్థితి వచ్చింది. కనీసం వాటికి ప్రత్యామ్నాయంగా అయినా కొత్త బ్లాక్స్ తీసుకొచ్చారా? తీసుకురాలేదు. అదే సమయంలో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్, యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లను ప్లాన్ చేశారు. కొత్త థర్మల్ ప్రాజెక్టులు పెడుతున్నప్పుడు వాటికి అవసరమైన బొగ్గు ఎక్కడి నుంచి వస్తుంది? అనేది కనీస కామన్ సెన్స్ కాదా?

...మిగతాది 2 లో

# వారికి జగన్ అండ్ కో ఫండింగ్ ఇచ్చి మరీ

- ఫ్యాక్షన్, రౌడీయిజాన్ని జగన్ ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు
- అభివృద్ధి చెందిన కుప్పాన్ని ప్రజలు చూడబోతున్నారు
- చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

జయభేరి, కుప్పం :



ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేసారు. తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయిస్తున్నా రని మండిపడ్డారు. ఫ్యాక్షన్, రౌడీయిజాన్ని జగన్ ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహించారు. హంద్రీ నీవా కాలువ ద్వారా కుప్పం వరకూ నీరు తీసుకువచ్చామని తెలిపారు. త్వరలో గాలేరు నగరిని కూడా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కుప్పంలో తమ భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ఏపీ వ్యాప్తంగా విస్తృతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కుప్పం నియోజకవర్గానికి గతంలో ఎన్నడూ రానన్ని పారిశ్రామిక ప్రాజెక్టులు వస్తున్నాయని తెలిపారు. వైసీపీ నేతలు ఫండింగ్ చేసి మరీ తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పైనా విమర్శలు చేసేందుకు కొన్ని సామాజిక మాధ్యమాలకు జగన్ అండ్ కో ఫండింగ్ ఇస్తున్నారని

...మిగతాది 2 లో

# ఉపాధి ఉన్న ప్రాంతంలోనే ఇళ్లు నిర్మించి అందిస్తాం

- ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

జయభేరి, హైదరాబాద్ :



అర్హత గల పేద నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన శాశ్వత నివాసాన్ని కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ నగరంలో వివిధ వృత్తుల్లో ఉపాధి చేసుకుంటున్నా పేదలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర మైనారిటీల సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, శాసనసభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ, మాజీద్ హుస్సేన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా లతో కలిసి 2 బీహెచ్‌కే గృహాల పట్టాలు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గత పదేళ్లుగా గృహాల కోసం ఎదురుచూసిన లబ్ధిదారులు పడిన ఇబ్బందులను ప్రభుత్వం గుర్తిస్తోందని, ఆ జాప్యానికి ప్రభుత్వ ప్రతినిధిగా విచారం వ్యక్తం చేస్తున్నానని అన్నారు. ఇకపై అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల అమలులో ఇటువంటి ఆలస్యం జరగకుండా ప్రభుత్వం కట్టుబడి

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ప్రశాంత్ కిశోర్ బిగ్ స్టేట్ మెంట్

ఎలా నెగ్గుకొస్తారనేది చర్చనీయాంశమైంది. గత 40, 45 ఏళ్లుగా బీజేపీకి పట్టం కడుతూ వస్తోంది.. బాంకీపూర్ నియోజకవర్గం. తన పోరాటంతో ఈ బలమైన కోటను బద్దలు కొట్టడానికి సిద్ధమని ప్రశాంత్ కిశోర్ జూన్ లోనే సంకేతాలు ఇచ్చారు. ఒకవేళ జన్ సూరాజ్ తనను అభ్యర్థిగా ఎంపిక చేస్తే రంగంలోకి దిగుతానని అప్పట్లో ప్రకటించారు. తాజాగా ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది జన్ సురాజ్ పార్టీ. ఆయన పోటీ చేయబోతోన్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ ఉప ఎన్నిక.. బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని సరికొత్త ఎన్డీఏ ప్రభుత్వ పనితీరుకు మొదటి అగ్నిపరీక్ష కాబోతోందని ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు. నాలుగు సంవత్సరాలుగా జన్ సురాజ్ తన జీవితంలో భాగం అయిందని, బీహార్‌లో మార్పు అనే ఆశయం నెరవేరే వరకు మరో లక్ష్యం తనకు లేదని తేల్చి చెప్పారు. ఎన్నికల ఫలితాలు తమకు నిరాశకు గురి చేసినప్పటికీ.. మార్పు అనే ఆశయాన్ని పునరుజ్జీవింపజేయడానికి ఈ ఉప ఎన్నిక ఉపయోగపడుతుందని చెప్పారు. బీజేపీ ఇంకా ఈ స్థానానికి అభ్యర్థి పేరును అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున నితిన్ నబీన్ పోటీ చేశారు. ఆయనకు ఏకంగా 98,299 ఓట్లు పోల్ అయ్యాయి. ఆయన ప్రత్యర్థి, ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారికి పడిన ఓట్లు 46,363 మాత్రమే. అటు జన్ సూరాజ్ పార్టీ అభ్యర్థి వందనా కుమారికి 7,717 ఓట్లు వచ్చాయి. నోటా'కు 1,464 ఓట్లు, ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి పంకజ్ కుమార్‌కు 790, స్వతంత్ర అభ్యర్థి రవి కుమార్‌కు 666 ఓట్లు పోల్ అయ్యాయి.. బాంకీపూర్ లో. ఈ స్థానం నుంచి నితిన్ నవీన్ 2006లో తొలిసారిగా అసెంబ్లీ విజయాన్ని చవిచూశారు. ఆ తర్వాత 2010, 2015, 2020, 2025 లలో వరుసగా బాంకీపూర్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ రికార్డు సృష్టించారు. అటువంటి పటిష్టమైన స్థానాన్ని ఈసారి చేజిక్కించుకుని చరిత్రాత్మక మార్పు తీసుకువస్తామని జన్ సూరాజ్ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఇంతకాలం వ్యూహకర్తగా మాత్రమే పని చేసిన ప్రశాంత్ కిశోర్ నేరుగా ఎన్నికల బరిలోకి దిగడం ఇదే మొదటిసారి. గత ఏడాది ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు.

## కొత్త థర్మల్ ప్రాజెక్టులు

గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలోని థర్మల్ ప్రాజెక్టులకు అవసరమైన కోల్ బ్లాక్‌స్‌ను అనుసంధానం చేశాయి. మరి మీరు ఎందుకు చేయలేదు? కేంద్ర ప్రభుత్వం కోల్ బ్లాక్స్ వేలం వేస్తే, ఆ వేలంలో పాల్గొని సింగరేణికి బ్లాక్స్ తెచ్చే ప్రయత్నం చేశారా? చేయలేదు. ఒకవేళ సింగరేణి ఆ బ్లాక్స్ దక్కించుకుని ఉంటే, వాటి రాయల్టీ కూడా తెలంగాణ రాష్ట్రానికే వచ్చేది కదా. కానీ మీరు అలా చేయలేదు. ఉన్న థర్మల్ ప్లాంట్లకే సరిపడే బొగ్గు లేకుండా చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లకూ సింగరేణి నుంచి బొగ్గు రాకుండా చేశారు. అంతిమంగా మీ ఆలోచన ఏమిటి? సింగరేణికి రావాల్సిన కోల్ బ్లాక్స్ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాలి... ఆ తర్వాత థర్మల్ పవర్ ప్రాజెక్టులకు బొగ్గు బయట నుంచి కొనాలి... ప్రైవేట్ వ్యక్తుల నుంచి కొనాలి... ఇదేనా మీ అసలు ప్రణాళిక? సింగరేణిని బలహీనపరచి, ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చే కుట్ర ఇది కాదా? సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి. వేలాది మంది కార్మికుల చెమటతో నిలిచిన సంస్థ. అలాంటి సంస్థను బలహీనపరచే విధంగా మీరు వ్యవహరించి, ఇప్పుడు మళ్లీ సింగరేణి గురించి మాట్లాడటం ప్రజలను మోసం చేయడమే.

## ఇళ్లు నిర్మించి అందిస్తాం

పనిచేస్తుందని స్పష్టం చేశారు. గృహాలు పొందుతున్న ప్రతి కుటుంబానికి అభినందనలు తెలియజేస్తూ, ఇది ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాల కల సాకారమైన చారిత్రక సందర్భంగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పేదల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని గృహ నిర్మాణ విధానాన్ని రూపొందించిందని తెలిపారు. పేదలు పని చేసే ప్రాంతాలకు దూరంగా కాకుండా, వారు ఉపాధి చేసుకుంటున్న ప్రాంతాల్లోనే ఇళ్లు నిర్మించి అందించేందుకు విలువైన ప్రభుత్వ భూములను కూడా వినియోగించాలనే నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ మహానగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని అన్నారు. అలాగే అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందజేయడం జరిగిందని అలాగే అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోనే రేషన్ కార్డు జారీ చేసే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. రేషన్ కార్డుతో పాటు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ, అర్హత గల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యత్వాన్ని విస్తృతంగా పెంచాలని పిలుపునిచ్చారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా విద్య, ఉపాధి, కుటుంబ అవసరాలు, ప్రార్థనా స్థలాలకు వెళ్లేందుకు ఎంతో సౌలభ్యం కలిగిందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వివిధ శాఖల్లో ఖాళీల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. హైదరాబాద్‌లోని పాత ప్రభుత్వ గృహ సముదాయాలు, వాంబే హౌసింగ్, జేఎన్ఎన్‌యూఆర్ఎం తదితర పథకాల కింద నిర్మించిన పాత భవనాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. నివాసయోగ్యం కాని భవనాలను వెంటనే ఖాళీ చేయించి, మరమ్మతు చేయదగిన భవనాలను పునరుద్ధరించి, పూర్తిగా శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేసి పునర్నిర్మించేందుకు మూడు విభాగాలుగా వర్గీకరించి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ మాట్లాడుతూ, పేదలకు శాశ్వత గృహం కల్పించడం సామాజిక న్యాయానికి ప్రతీక అని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి పారదర్శకంగా గృహాల పంపిణీ జరుగుతోందని, పేదల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా నగరంలోనే ఇళ్లు నిర్మించి అందించాలన్న ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఇంతకుముందు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల మంత్రులకు వివరాలు తెలియజేస్తూ, మొత్తం 361 గృహాలను పట్టాలు పంపిణీ చేసి తాళాలు అందజేస్తున్నట్లు తెలిపారు. వీటిలో చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడ మండలానికి చెందిన లబ్ధిదారులకు 187 గృహాలు, నాంపల్లి నియోజకవర్గంలోని ఆసిఫ్‌నగర్ మండలానికి చెందిన లబ్ధిదారులకు 79 గృహాలు, నాచారం కాలనీకి చెందిన లబ్ధిదారులకు 95 గృహాలు కేటాయించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, శాసనసభ్యులు అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వ గృహాల పంపిణీ కార్యక్రమాన్ని అభినందించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.


## వారికి జగన్ అండ్ కో ఫండింగ్ ఇచ్చి మరీ


ఆరోపించారు. హింస, అసభ్యతలనే గొడ్డలి పార్టీ నమ్ముకుందని ఎద్దేవా చేశారు. ఫ్యాక్షన్, రౌడీయిజాన్ని జగన్ ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. హంద్రీ నీవా కాలువ ద్వారా కుప్పం వరకూ నీరు తీసుకువచ్చామని తెలిపారు. త్వరలో గాలేరు నగరిని కూడా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గానికి గతంలో ఎన్నడూ రానన్ని పారిశ్రామిక ప్రాజెక్టులు వస్తున్నాయని తెలిపారు. కుప్పం కోసం ప్రత్యేక ప్రణాళికలు కుప్పం నియోజకవర్గానికి రోడ్లు, కమ్యూనికేషన్ సహా అన్ని రంగాల్లోనూ కనెక్టివిటీ పెంచుతున్నామని చెప్పుకొచ్చారు. అభివృద్ధి చెందిన కుప్పాన్ని ప్రజలు చూడబోతున్నారని వివరించారు. రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గాన్ని ఇలాగే తీర్చిదిద్దుతామని అన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ విధానంలో అన్ని ప్రాంతాలూ ప్రగతి సాధించేందుకు వీలుగా ప్రణాళికలు చేశామని వెల్లడించారు. ఏపీలో క్వాంటం, సెమీ కండక్టర్ల విభాగాల్లో పెట్టుబడులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్ తున్నామని వివరించారు. డిసెంబరు నాటికి అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని వివరించారు. రాష్ట్రంలో పరిశ్రమలతో పాటు పచ్చదనానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కరిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు.

# ఈ బస్ స్టాండ్‌కు వేళ్తే..

## ఒకేసారి రెండు రాష్ట్రాల్లో అడుగుపెట్టినట్లే..

**భారతదేశంలో ఎన్నో ప్రత్యేకమైన ప్రదేశాలు ఉన్నప్పటికీ, ఒక బస్ స్టేషన్ మాత్రం తన విశేషంతో అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఇక్కడ ఒక్క అడుగు వేస్తే చాలు.. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రంలోకి వెళ్లిపోవచ్చు. ఈ అరుదైన బస్ స్టేషన్ భారత వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తూ పర్యాటకులను కూడా విశేషంగా ఆకర్షిస్తోంది.**





భారతదేశం వైవిధ్యానికి నిలయంగా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రతి రాష్ట్రానికి ప్రత్యేకమైన భాష, సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, జీవనశైలి ఉండటం దేశ గొప్పతనాన్ని ప్రతిబింబిస్తుంది. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లినప్పుడు భాష మాత్రమే కాదు, ప్రజల జీవన విధానం కూడా పూర్తిగా మారిపోతుంది. అందుకే భారతదేశాన్ని "వైవిధ్యంలో ఏకత్వం"కు ప్రతీకగా పేర్కొంటారు. దేశంలోని వివిధ రాష్ట్రాల సరిహద్దుల గురించి చాలామందికి తెలుసు. అయితే, ఒకే చోట నిలబడి రెండు రాష్ట్రాలను సందర్శించే అవకాశం కల్పించే బస్ స్టాండ్ గురించి ఎప్పుడైనా విన్నారా? ఇది వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా, నిజంగానే అలాంటి ప్రత్యేకమైన బస్ స్టేషన్ భారతదేశంలో ఉంది. ఈ బస్ స్టాండ్ ప్రత్యేకత ఏమిటంటే, ఒక వైపు నిలబడి ఉంటే పశ్చిమ బెంగాల్‌లో ఉంటారు.. ఒక్క అడుగు ముందుకు వేస్తే ఒడిశా రాష్ట్రంలోకి ప్రవేశిస్తారు. ఈ అరుదైన బస్ స్టేషన్ పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిద్నాపూర్ జిల్లాలో ఉంది. దంతన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోల్‌పాటా అనే ప్రాంతంలో ఈ బస్ స్టాండ్ ఏర్పాటు చేయబడింది. మిద్నాపూర్ నగరానికి సుమారు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతం పశ్చిమ బెంగాల్‌కు చివరి సరిహద్దుగా గుర్తింపు పొందింది. ఇక్కడే బెంగాల్ భూభాగం ముగిసి, వెంటనే ఒడిశా రాష్ట్ర సరిహద్దు ప్రారంభమవుతుంది. ఈ కారణంగానే స్థానిక ప్రజలు ఈ ప్రదేశాన్ని "బెంగాల్ చివరి బస్ స్టేషన్" అని పిలుస్తుంటారు. ఇక్కడికి వచ్చే ప్రయాణికులకు ఒకేసారి రెండు రాష్ట్రాల వాతావరణాన్ని ఆస్వాదించే అవకాశం లభిస్తుంది. సరిహద్దు ప్రాంతం కావడంతో ఇక్కడి భౌగోళిక ప్రత్యేకత అనేక మందిని ఆకర్షిస్తోంది. సోల్‌పాటా మాత్రమే కాదు, ఇదే ప్రాంతానికి సమీపంలో ఉన్న సోనాకోనియా ప్రాంతంలో కూడా ఇలాంటి ప్రత్యేకమైన బస్ స్టేషన్ ఉంది. ఈ రెండు బస్ స్టేషన్లు పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలను అనుసంధానించే ప్రధాన రవాణా కేంద్రాలుగా పనిచేస్తున్నాయి. దీంతో రెండు రాష్ట్రాల మధ్య ప్రయాణించే వేలాది మంది ప్రజలకు ఇవి ఎంతో కీలకంగా మారాయి. స్థానికుల కథనం ప్రకారం, గత కొన్ని దశాబ్దాలుగా ఈ బస్ స్టేషన్ రెండు రాష్ట్రాల ప్రజలకు ప్రధాన రవాణా కేంద్రంగా కొనసాగుతోంది.
ప్రతిరోజూ కోల్‌కతా, మిద్నాపూర్, కాంతి వంటి ప్రాంతాలకు వెళ్లే అనేక ప్రభుత్వ బస్సులు ఇక్కడి నుంచి ప్రయాణిస్తాయి. అలాగే ఒడిశాలోని పలు పట్టణాలు, గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు కూడా ఈ బస్ స్టేషన్‌పైనే ఎక్కువగా ఆధారపడుతుంటారు. ఉద్యోగాల కోసం, విద్యాభ్యాసం కోసం, వైద్య చికిత్స కోసం లేదా వ్యాపార అవసరాల నిమిత్తం ప్రతిరోజూ వేలాది మంది ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ బస్ స్టాండ్ వద్ద ప్రయాణికుల రద్దీ కనిపిస్తూనే ఉంటుంది. అందువల్ల ఇది కేవలం బస్సులు ఆగే ప్రదేశం మాత్రమే కాదు, రెండు రాష్ట్రాల ప్రజల నిత్యజీవితంలో కీలక పాత్ర పోషించే రవాణా కేంద్రంగా మారింది.

ఈ ప్రాంతం మరో ప్రత్యేకత ఏమిటంటే, ఇక్కడ రెండు రాష్ట్రాల సంస్కృతులు ఎంతో సహజంగా కలిసిపోతాయి. బెంగాలీ, ఒడియా భాషలు రెండూ ఇక్కడ విస్తృతంగా వినిపిస్తాయి. స్థానిక ప్రజలు రెండు భాషల్లోనూ మాట్లాడగలగడం సాధారణ విషయమే. అలాగే రెండు రాష్ట్రాల సంప్రదాయాలు, పండుగలు, ఆచారాలను సమానంగా గౌరవిస్తూ కలిసి జరుపుకోవడం ఇక్కడి ప్రత్యేకతగా చెప్పవచ్చు. సరిహద్దు ప్రాంతం కావడంతో ఇక్కడి మార్కెట్లు, దుకాణాలు, స్థానిక వ్యాపారాల్లో కూడా రెండు రాష్ట్రాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఆహారపు అలవాట్లు, దుస్తులు, స్థానిక కళలు, సంస్కృతిలో బెంగాలీ, ఒడియా సంప్రదాయాల అందమైన సమ్మేళనం కనిపించడం ఈ ప్రాంతాన్ని మరింత ప్రత్యేకంగా నిలబెడుతోంది. పర్యాటక కోణంలో కూడా ఈ ప్రదేశానికి మంచి ప్రాధాన్యం ఉంది. ఒకే చోట నిలబడి రెండు రాష్ట్రాల సరిహద్దును అనుభవించడం, అక్కడి స్థానిక జీవన విధానాన్ని దగ్గరగా చూడడం, రెండు భిన్న సంస్కృతుల కలయికను ఆస్వాదించడం వంటి ప్రత్యేక అనుభూతిని ఈ బస్ స్టేషన్ సందర్శించే ప్రతి ఒక్కరూ పొందుతారు. అందుకే సాధారణ బస్ స్టాండ్‌గా కనిపించే ఈ ప్రదేశం, భారతదేశ వైవిధ్యాన్ని ప్రతిబింబించే అరుదైన ప్రదేశంగా గుర్తింపు పొందింది.




# ఇన్‌స్టాగ్రామ్ పై కేంద్రం తీవ్ర ఆగ్రహం

### ఏడు రోజుల్లోగా లెక్క తేలాలి

జయభేరి, న్యూఢిల్లీ:

ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' సంస్థకు కేంద్ర ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫారమ్‌లో చిన్నారులపై లైంగిక దోపిడీని ప్రోత్సహించేలా కొన్ని క్రూరమైన ప్రకటనలు (యాడ్స్) రావడంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పిల్లలపై సాగే లైంగిక అరాచకాలకు సంబంధించిన కంటెంట్‌ను ప్రచారం చేసే ఇలాంటి అసాంఘిక ప్రకటనలు వెలుగులోకి రావడంతో.. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ మెటా సంస్థకు తీవ్ర హెచ్చరికలతో కూడిన నోటీసులు జారీ చేసింది. ఇటువంటి వివాదాస్పద ప్రకటనలను తక్షణమే నిలిపివేయాలని కేంద్రం స్పష్టం చేసింది. శనివారం రాత్రి జారీ చేసిన ఈ నోటీసులో మెటా సంస్థ నుంచి కేంద్ర ప్రభుత్వం తక్షణ వివరణను డిమాండ్ చేసింది. పిల్లల లైంగిక వేధింపులను ప్రోత్సహించే కంటెంట్ లేదా దానికి దారితీసే అకౌంట్లకు సంబంధించిన పెయిడ్ యాడ్స్ అసలు ఇన్‌స్టాగ్రామ్‌లో ఎలా ఆమోదం పొందాయో చెప్పాలని నిలదీసింది. దీనిపై పూర్తి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను ఏడు రోజుల్లోగా తమకు సమర్పించాలని ఆదేశించింది. సామాజిక మాధ్యమాల భద్రతా నిబంధనలను మెటా సంస్థ ఏ స్థాయిలో బేఖాతరు చేస్తోందో ఈ ఘటనే నిరూపిస్తోందని ఐటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**మంత్రి అశ్విని వైష్ణవ్ సీరియస్.. నిఘా పెట్టిన అధికారులు**

కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు రంగంలోకి దిగి మెటా సంస్థను గట్టిగా ప్రశ్నించారు. చిన్నారుల భద్రతకు సంబంధించిన అత్యంత సున్నితమైన అంశంలో ఇలాంటి ఘోరమైన వైఫల్యాలు ఎలా సంభవించాయనే దానిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రకటనల ఆమోద ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని, అటువంటి వివాదాస్పద అడ్వర్టైజ్‌మెంట్లను యాప్ నుంచి శాశ్వతంగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. సాధారణంగా తమ ప్లాట్‌ఫారమ్‌లలో ఇటువంటి కంటెంట్‌ను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), ఆటోమేటెడ్ సిస్టమ్స్, హ్యూమన్ రివ్యూ వంటి ఎన్నో రక్షణ వ్యవస్థలను వాడుతున్నట్లు మెటా గతంలో గొప్పలు చెప్పుకుంది. అయితే ఈ భద్రతా వలయాలు పూర్తి స్థాయిలో పనిచేయడం లేదని తాజా ఉదంతం స్పష్టం చేస్తోంది. దీంతో తమ లోపాలను అంగీకరించిన మెటా.. మరిన్ని కఠిన చర్యలు చేపడుతున్నట్లు, అసంబద్ధ కంటెంట్‌ను ముందే నిలిపివేయడానికి సాంకేతిక సామర్థ్యాలను పెంచుతున్నట్లు పేర్కొంది.

**మెటాకు చుట్టుముడుతున్న భద్రతా సవాళ్లు!**

ఈ వారంలో కేంద్ర ప్రభుత్వం నుంచి మెటా సంస్థ ఎదుర్కొంటున్న రెండవ అతిపెద్ద భద్రతా సవాలుగా ఇది నిలిచింది. దీనికి కొద్ది రోజుల ముందే వాట్సాప్ ప్రవేశపెట్టనున్న 'యూజర్ నేమ్' (Username) ఫీచర్ పై సైతం కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. దీని ద్వారా ఐడెంటిటీ దొంగతనాలు, సైబర్ మోసాలు పెరిగే ముప్పు ఉందంటూ పూర్తి సమాచారాన్ని సమర్పించాల్సిందిగా కేంద్రం నోటీసుల్లో కోరిన విషయం తెలిసిందే. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో భారతీయ పౌరుల భద్రత, ముఖ్యంగా చిన్నారుల సంరక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని కేంద్ర ఐటీ శాఖ తేల్చి చెప్పింది. దేశవ్యాప్తంగా సామాజిక మార్గదర్శకాలకు లోబడి ఇంటర్నెట్ సురక్షితంగా ఉండాలని కోరుకుంటోంది. నియంత్రణ నిబంధనలు ఉల్లంఘిస్తే తదుపరి ఎలాంటి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలో ప్రభుత్వం మెటా నుంచి వచ్చే వివరణ ఆధారంగా నిర్ణయిస్తుంది.

# ఒరేయ్ ఏంట్రా ఇది..

### ఈ మూడు బైక్స్ నంబర్స్ గమనించారా..?




**ఒకే రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్‌ను మూడు హోండా యాక్టివా వాహనాలకు ఉపయోగిస్తూ ప్రభుత్వ శాఖలు, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థను మోసం చేయడానికి ప్రయత్నించిన ముగ్గురిని హైదరాబాద్ చార్మినార్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నకిలీ నంబర్ ప్లేట్‌తో ఫైనాన్స్ రికవరీ, ట్రాఫిక్ చలానాల నుంచి తప్పించుకునేందుకు ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.**

ఒకే రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్‌తో మూడు బైక్స్ రోడ్లపై తిరుగుతున్నాయంటే నమ్మగలరా? ప్రభుత్వ అధికారులను, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థను మోసం చేసేందుకు ఇలాంటి తెలివైన ప్లాన్ వేసిన ముగ్గురిని హైదరాబాద్‌లో చార్మినార్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిని నాకోటి మల్లికార్జున్ (28), భీమ్ అజయ్ రెడ్డి (29), కొప్పుల ధనరాజ్ (30)గా గుర్తించారు. వీరి వద్ద నుంచి TS09 FE 4997 నంబర్ ప్లేట్‌ను ఉపయోగిస్తున్న మూడు హోండా యాక్టివా బైక్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మోసం ఎలా బయటపడిందంటే.. చార్మినార్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో భీమ్ అజయ్ రెడ్డి యాక్టివాతో వెళ్తుండగా ఆపి వాహన పత్రాలు పరిశీలించారు. రిజిస్ట్రేషన్ నంబర్‌కు సంబంధించిన ఇంజిన్, చాసిస్ నంబర్లు సరిపోకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. దీంతో లోతుగా విచారణ చేపట్టగా అసలు కథ వెలుగులోకి వచ్చింది. పోలీసుల దర్యాప్తులో, ఫైనాన్స్‌పై కొనుగోలు చేసిన రిజిస్ట్రేషన్ లేని యాక్టివాకు మరో యాక్టివా అసలు రిజిస్ట్రేషన్ నంబర్‌ను నకిలీ ప్లేట్ రూపంలో అమర్చినట్లు తేలింది. అంతేకాదు.. బ్యాంక్ రికవరీ చర్యల నుంచి తప్పించుకోవడం, ట్రాఫిక్ చలానాలు, అధికారుల తనిఖీలను తప్పుదోవ పట్టించడం కోసం అదే నంబర్ ప్లేట్‌ను మరో యాక్టివాకు కూడా ఉపయోగించినట్లు విచారణలో వెల్లడైంది. అంటే, ఒకే రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఏకంగా మూడు వాహనాలు రోడ్లపై తిరుగుతూ ప్రభుత్వ శాఖలు, ఫైనాన్స్ సంస్థలను మోసం చేయడానికి ప్రయత్నించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై వారాసిగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, మూడు హోండా యాక్టివా వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మోసం వెనుక మరెవరైనా ఉన్నారా? ఇలాంటి నకిలీ నంబర్ ప్లేట్లతో మరిన్ని వాహనాలు తిరుగుతున్నాయా? అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది.


# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

- ఆలయ అభివృద్ధికి కృషి : ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లా రెడ్డి

**జయభేరి, మేడ్చల్, జులై 05 :**

అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మేడ్చల్ ఎమ్మెల్యే మల్లా రెడ్డి లు అన్నారు. మేడ్చల్ సర్కిల్ కిష్టాపూర్ పూడూర్ డివిజన్ పరిధిలోని కిష్టాపూర్ అర్చన కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్ మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామ దేవతల పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసం, భక్తి భావం సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలకు వేదికలుగా నిలవాలని పేర్కొన్నారు. కిష్టాపూర్ అర్చన కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ





దేవాలయం అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆలయ పరిసరాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. స్థానిక ప్రజల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీకి సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, డిసిసి మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ మేడ్చల్ అధ్యక్షులు జల్లి శైలజ హరినాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్, మాజీ కౌన్సిలర్లు తుడుం గణేష్, జాకట దేవ, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ డివిజన్ అధ్యక్షులు నడికొప్పు నాగరాజ్ ముదిరాజ్, నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, గోమారం బాల్ రెడ్డి, సత్యనారాయణ, బి జె పి నాయకులు రాంచంద్రా రెడ్డి, అర్జున్, రాజు స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా ముగిసింది.



## భక్తిశ్రద్ధలతో చండీ హోమం

**జయభేరి, మేడ్చల్, జులై 05 :**

సైబరాబాద్ మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ సర్కిల్ కిష్టాపూర్ పూడూర్ డివిజన్ కిష్టాపూర్ అర్చన కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా భక్తిశ్రద్ధలతో చండీ హోమంను నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం రెండవ రోజు భాగంగా చండి ఉపాసకులు బ్రహ్మశ్రీ సంజయ శర్మ వైదిక బృందంతో శనివారం ఉదయం 8 గంటల నుండి కర్మణః పుణ్యాహ వాచనం ప్రతిష్ట విగ్రహ ఏకాశితి కలశ స్నపనం చండీ హోమము, భారీ ఎత్తున మహిళలు పాల్గొని శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారికి దాన్యాదివాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 4 నుండి స్థాపిత దేవత హోమాలు ప్రతిష్ట దేవత మూలమంత్ర హోమాలు అనంతరం ఫలాదివాసం, పుష్పాదివాసం, శయ్యాధివాసం హారతి మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. నేటి ఉదయాత్ పూర్వము బ్రాహ్మి ముహూర్తం 3:30గంటల నుండి కర్మణః పుణ్యాహ వాచనం, గర్తన్యాసం, బీజన్యాసం, ధాతున్యాసం, 4:50 గంటలకు యంత్రస్థాపన నల్లపోచమ్మ పరివార, విగ్రహాల ప్రతిష్ట ప్రాణప్రతిష్ట దృక్ బలి, దిక్ బలి, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన సంప్రోక్షణ, శాంతి కళ్యాణం మహా నైవేద్యం హారతి మంత్రపుష్పం ఆశీర్వచనం పండిత సన్మానం మధ్యాహ్నం 12గంటల నుండి అన్నప్రసాద సంతర్పణ నిర్వహించబడుతుంది. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కమిటీ సభ్యులు రెడ్డంగారి నవీన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మున్సిపల్ మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తొంట యాదయ్య, బి జే పి సీనియర్ నాయకులు రాంచంద్రా రెడ్డి లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కిష్టాపూర్‌లో నల్ల పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న రామన్నగారి రాఘవేందర్ గౌడ్




**జయభేరి, మేడ్చల్:**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిష్టాపూర్-పూడూర్ డివిజన్ అర్చన కాలనీలో శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ తల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అర్చన కాలనీ వాసులు, కిష్టాపూర్-పూడూర్ డివిజన్ ప్రతినిధులతో కలిసి రాఘవేందర్ గౌడ్ ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు కమలాకర్ రెడ్డి, సుధాకర్ చారి, జనార్ధన్ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తొంట యాదయ్య, వేముల నాగిరెడ్డి, రంజిత్ రెడ్డి, తొంట సుధాకర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అత్యవసర వైద్య సేవలపై ఆర్వీఎంలో రాష్ట్ర స్థాయి సదస్సు

- రాష్ట్రంలోనే మొట్ట మొదటి జరిగిన సమావేశం
- హాజరైన దేశంలోని ప్రముఖ ఆసుపత్రి వైద్య కళాశాలల వైద్యులు,విద్యార్థులు




**జయభేరి, గజ్వేల్ /ములుగు, జులై 05 :**

తెలంగాణలో మొట్ట మొదటి సారిగా రోగికి అత్యవసర సమయంలో మనోధైర్యం నింపుతూ అందించాల్సిన వైద్య సేవలపై అవగాహన సదస్సును లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రి వైద్య కళాశాలలో ఆదివారం నిర్వహించారు. వైద్య కళాశాల చైర్మెన్ డాక్టర్ యాకయ్య ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నిజాం కళాశాల డీన్ పి చంద్రశేఖర్ హాజరయ్యారు. అంతేకాక పక్కా రాష్ట్రాల్లో గల CMC వేలూరు,కిమ్స్,నిమ్స్,అపోలో, AIIMS బీబీనగర్ వంటి ప్రముఖ ఆసుపత్రుల నుండి అత్యవసర చికిత్సలందించే వైద్యులు,విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్వీఎం వైద్య కళాశాల విద్యార్థులకే కాక ఆయా కళాశాలల్లోనూ అత్యవసర విద్యను అభ్యసించే పీజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. రెండు రోజులుగా జరుగుతున్న సదస్సులో గుండె సంబంధిత, గర్భిణీ స్త్రీలకు,రోడ్డు ప్రమాదాల్లో గాయపడి చికిత్స అత్యవసరమైన రోగులకు మనోధైర్యం నింపడం,త్వరితంగా చికిత్సలందించడం గూర్చి ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు అవగాహన కల్పించడమే లక్ష్యంగా వర్క్ షాప్ ను నిర్వహించారు. ఇంత గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టి,విజయవంతంగా ఆర్వీఎం వైద్య కళాశాల చైర్మెన్ యాకయ్య,ఆయన బృందాన్ని డాక్టర్లు, విద్యార్థులు అభినందించారు.



## సర్ ఓటర్ సవరణ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

- మాజీ సర్పంచ్, వైస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి చుక్కా రాము నాయుడు పిలుపు

**జయభేరి, పరవాడ:**

మండలంలో,గ్రామాలలో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటరు జాబితా సవరణ సర్వేను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పరవాడ మాజీ సర్పంచ్,వైస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి చుక్కా రాము నాయుడు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా చుక్కా మాట్లాడుతూ పరవాడ గ్రామస్తులు అందరూ జరుగుతున్న ఓటరు సర్వే కు ప్రాధాన్యం ఇచ్చి అర్హులైన ప్రతి ఓటరు సర్వేలో పాల్గొని వివరాలను సక్రమంగా నమోదు చేసి ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు.ఈ సర్వే ఈ నెల జులై 14 వరకు జరుగుతుందని స్థానిక బిఎల్ఓలను కలిసి తమ ఓటుకు సంబంధించి వివరాలని సరిచూసుకోవాలని అన్నారు. మన ఓటు - మన బాధ్యత అనే భావనతో ప్రతి ఒక్కరూ సరైన సమాచారాన్ని అందించి సర్వేలో గ్రామస్థులు అందరూ పాల్గొని తమ ఓటును నిర్ధించుకోవాలని కోరారు.

## ముమ్మరంగా సాగుతున్న సర్ ఓటర్ సవరణ సర్వే పక్రియ

- విశ్రాంతి లేకుండా శ్రమిస్తున్న బిఎల్వో, బిఎల్ఏ, సచివాలయం సిబ్బంది



**జయభేరి, పరవాడ:**


దేశవ్యాప్తంగా సమగ్రమైన, పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించాలి అనే లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రారంభించిన సార్ ప్రోగ్రాం ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) అనగా ఓటరు జాబితాలో సమగ్రతను, కచ్చితత్వాన్ని నిర్ణయించడానికి ఎన్నికల సంఘం చేపట్టే ప్రత్యేకమైన కార్యక్రమం జులై 14 వరుకు జరిగే ఈ సర్వే గ్రామాలలో సరేవేగంగా సాగుతుంది. గ్రామాలలో ప్రజలను ఓట్ల సవరణ గురించి వివరిస్తూ ఆటోలు పై ప్రకటనలు చేస్తున్నారు.కొత్తగా ఓట్లు చేర్పులు ఉన్నా ప్రత్యేక ఫ్రాం నింపి తీసుకుంటున్నారు.బిఎల్వోలు ఇంటినికి ఇంటికి వెళ్లి అసలు ఓటర్స్ నివాసం ఉంటున్నారా లేదా అని నిర్ధారణ చేయనుకోంటున్నారు. అందులో భాగంగా ఈ రోజు పరవాడ గ్రామంలో సంత బయిల వద్ద పెట్టిన స్పెషల్ ఓటర్స్ వెరివికేషన్ లో బిఎల్ఓల తో మమేకమై ఓటర్స్ కి సహాయ సహకారాలు అందించిన పరవాడ గ్రామ యువ నాయకులు వర్రి చంద్రశేఖర్, పైల బుజ్జి, చుక్క రవి కుమార్,బొడ్డు బుజ్జి,సిద్ధనాతి కుశమంత్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# గుండ్లపోచంపల్లి కాంగ్రెస్‌లో కుమ్ములాటలు..!

- డివిజన్ అధ్యక్ష పదవి నియామకంతో బహిర్గతమైన వర్గ విభేదాలు
- సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు ఆరోపణలు
- మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్ కు డిసిసి షోకాజ్ నోటీసులు

**జయభేరి, మేడ్చల్, జులై 05 :**

మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుల నియామకాలు రాజకీయ వేడిని రాజేశాయి. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్ష పదవుల్లో మార్పులు చేపట్టింది. ఈ క్రమంలో మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు అధ్యక్ష పదవుల కోసం తమవంతు ప్రయత్నాలు చేశారు. సోమవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మేడ్చల్ నియోజకవర్గంలోని 16 డివిజన్ల అధ్యక్షుల పేర్లను అధికారికంగా ప్రకటించారు. అయితే ఆశావహుల పేర్లు అధికారిక జాబితాలో లేకపోవడంతో కొందరు నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాము ఎన్నో సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసినా పార్టీ పెద్దలు తమ సేవలను గుర్తించలేదని ఆరోపిస్తూ కొందరు నాయకులు రాజీనామాలు చేశారు. డివిజన్ అధ్యక్షుల నియామకాలతో ప్రారంభమైన అసంతృప్తి గత మూడు రోజులుగా సోషల్ మీడియా వేదికగా పోటాపోటీ విమర్శలు, ఆరోపణలు,ప్రత్యారోపణలకు దారితీస్తోంది. వీడియో సందేశాలు, పోస్టుల ద్వారా నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పిస్తుండటంతో ఈ వ్యవహారం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.




### భేరి ఈశ్వర్ ఘాటు వ్యాఖ్యలు..

గుండ్లపోచంపల్లి డివిజన్ నూతన అధ్యక్షుడు గారిసెల సురేందర్ ముదిరాజ్ సన్మాన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్ ఆశావహుల రాజీనామాలపై స్పందించారు. కొంతమంది నాయకులు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అమాయక నాయకులను బలి పశువులుగా చేస్తున్నారని ఆయన విమర్శించారు. పార్టీ పదవులను అందరూ ఆశిస్తారని, అయితే కొందరికే అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు. కొంతమంది నాయకులు పీసీసీ అధ్యక్షుడి లేఖను ఫోర్జరీ చేశారని భేరి ఈశ్వర్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఎంపీ మల్లు రవి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌లకు ఫిర్యాదు చేయాలని గారిసెల సురేందర్‌కు సూచించారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌తో భేరి ఈశ్వర్ ఫోన్‌లో మాట్లాడారు.

ఈ సందర్భంగా స్పందించిన వజ్రేష్ యాదవ్, పార్టీ అంతర్గత అంశాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే వారిని గుర్తించి కఠిన చర్యలు ఉన్నాయని అవసరమైతే పార్టీ నుంచి సస్పెండ్ చేయడానికీ వెనుకాడబోమని జంగయ్య యాదవ్ హెచ్చరించారు. ఇదిలా ఉండగా శనివారం డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్(జంగయ్య) యాదవ్ మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్ కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై భేరి ఈశ్వర్ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తనకు షోకాజ్ నోటీసులు జారీ చేసే అధికారం మేడ్చల్ నియోజకవర్గ డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్‌కు లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత అంశాలను కొందరు సోషల్ మీడియాలో వైరల్ చేసిన విషయాన్ని ఫోన్ ద్వారా జంగయ్య యాదవ్ దృష్టికి తీసుకెళ్లానని, అంతే తప్ప పీసీసీ లేదా డీసీసీ నాయకత్వంపై ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ లేఖను బయటకు తీసుకువచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పిన జంగయ్య యాదవ్ దళితుడినైన తనకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం సరైన విధానం కాదని భేరి ఈశ్వర్ విమర్శించారు. కొందరు తప్పు చేసినప్పటికీ తనను లక్ష్యంగా చేసుకుని నోటీసులు జారీ చేసి భయపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. డీసీసీ జారీ చేసిన షోకాజ్ నోటీసుల అంశాన్ని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందుకు తీసుకెళ్లి అక్కడే తేల్చుకుంటానని భేరి ఈశ్వర్ తెలిపారు.



### మేడ్చల్ కాంగ్రెస్‌లో అగ్రనేతల గ్రూప్ రాజకీయాలు..

మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో అగ్రనేతల మధ్య గ్రూప్ రాజకీయాలు కొనసాగుతున్నాయని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి వర్గాలుగా రాజకీయాలు సాగుతున్నాయని సమాచారం. గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్షుడిగా ఎంపికైన గారిసెల సురేందర్‌కు ఒక వర్గం నేతల మద్దతు ఉండగా, అధ్యక్ష పదవిని ఆశించిన మాజీ సర్పంచ్ బండారి నరేందర్‌కు మరో వర్గం నేతల మద్దతు ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నియోజకవర్గ నాయకత్వం రెండు పేర్లను పీసీసీ అధ్యక్షుడికి పంపగా, చివరకు గారిసెల సురేందర్ పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అంతర్గత విభేదాలను పక్కనబెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పలువురు సీనియర్ నేతలు సూచిస్తున్నారు.

## బదిపల్లిలో సార్ ప్రత్యేక సమగ్ర కార్యక్రమం

**జయభేరి, కొత్తపల్లి :**

బదిపల్లి గ్రామంలో నిర్వహించిన సార్ ప్రత్యేక సమగ్ర కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు గ్రామ ప్రజలు సహకరించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓతో కలిసి కాంగ్రెస్ నాయకులు కోడూరు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు పంజాల స్వామి గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తిని గణేష్, మండల ప్రధాన కార్యదర్శి మునిగల శ్రీనివాస్, గ్రామ ఉపాధ్యక్షుడు తాండ్ర సంజీవ్, గ్రామ ప్రధాన కార్యదర్శి తాండ్ర రాజకుమార్, కారోబారి వెంగళం వాసరయ్య పాల్గొన్నారు.

# కేజీబీవీ వర్కర్స్, నాన్ టీచింగ్ సిబ్బంది జీతాలు పెంచాలి

- టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ ఎల్ పద్మ పిలుపు

జయభేరి, దేవరకద్ర :

కేజీబీవీ వర్కర్స్, నాన్ టీచింగ్ సిబ్బంది అందరికీ జీతాలు పెంచాలని టి యు సి ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కేజీబీవీ టీచింగ్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్రఎస్ఎల్ ఎస్ఎల్ పద్మ డిమాండ్ చేశారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ లో ఆదివారం కేజీబీవీ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి పద్మ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా కేజీబీవీ లలో వేలాదిమంది పనిచేస్తున్న వర్కర్లకు మరియు నాన్ టీచింగ్ సిబ్బందికి చట్టం ప్రకారం వేతనాలు పెంచాలని కోరారు. ఈ మధ్యకాలంలో ముఖ్యమంత్రి వేతనాలు పెంచినవి కేజీబీవీ లకి వర్తింప చేయకపోవడం విడ్డూరంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తపరిచారు. 2006లో ఏర్పడ్డ కేజీబీవీలు విద్యార్థినీయుల విద్యాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న వాళ్ళ బతుకులలో మాత్రం చీకటి అలుముకుంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మన అసోసియేషన్ ఆధ్వర్యంలో 15 సార్లు ఎస్పీడీకి మరియు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిలతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రాలు ఇవ్వడం జరిగిదన్నారు వర్కర్లకు. సిబ్బందికి జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పర్మినెంట్ చేయాలని, పిఎఫ్, హెల్త్ కార్డు ఇవ్వాలని, గ్రాటివిటీ 5 లక్షల ఇవ్వాలని, ఉద్యోగం పనిచేస్తూ చనిపోతున్న వారికి 10 లక్షలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన వారాంతపు సెలవును చాలా హాస్టల్లో ఎస్ ఓలు అమలు చేయకుండా చిన్న ఉద్యోగుల పట్ల వివక్ష పాటించడం విరమించుకొని అందరికీ రొటేషన్ పద్ధతిలో లో వారాంతపు సెలవు అమలు చేయాలని ఆమె కోరారు. స్కీంల కింద ఇలాంటి విద్యాసంస్థలు ప్రారంభించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమదోపిడికి పాల్పడుతున్నాయని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేసి హామీ నిలబెట్టుకోవాలని ముఖ్యమంత్రిని కి ఆమె విన్నవించారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం కార్మిక చట్టాలను రద్దుచేసి కొత్త నాలుగు లేబర్ కోళ్లను తీసుకొచ్చి పెట్టుబడిదారులకు, ధనవంతులకు ఊడిగం చేయడానికి పూనుకుంటుందని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా కేజీబీవీ వర్కర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించడం కోసం భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వాన్ని స్థంభింప చేస్తామని ఆమె అన్నారు. అదేవిధంగా ఢిల్లీ గవర్నమెంట్ పై కూడా ఆందోళనలకు పిలుపు ఇస్తామని హెచ్చరించారు. టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి. నారాయణమ్మ మాట్లాడుతూ కేజీబీవీ లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. వాళ్ళ సమస్యల పరిష్కారం కోసం మా వంతు సహకారాన్ని అందజేస్తామన్నారు. కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. అరుణ్ కుమార్ టియుసిఐ జిల్లా కార్యదర్శి సాంబశివుడు లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగ వ్యతిరేక విధానాలపై సమరసిలమైన పోరాటాలకు సిద్ధం కావాలని, ఉద్యమాలు పోరాటాల ద్వారానే మన హక్కులు సమస్యలు పరిష్కరించుకోగలుగుతామన్నారు. కావున ఆ వైపుగా అందరూ కృషి చేయాలని వారు కోరారు.




## బాహుపేట స్టేజీ వద్ద మాజీ మంత్రి కేటిఆర్ కు స్వాగతం



జయభేరి, యాదగిరిగుట్ట, జూలై 5 :

జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కన్నెపల్లి పంప్ హౌస్ వెళ్తున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు ఘన స్వాగతం లభించింది. ఆదివారం యాదగిరిగుట్ట మండలంలోని బాహుపేట స్టేజీ వద్ద మాజీ ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చిన పార్టీ కార్యకర్తలతో కేటీఆర్ ముచ్చటించారు. అనంతరం ఆయన పంపు హౌస్ కు బయల్దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, బహుపేట, మైలారిగూడెం సర్పంచులు కవిడే మహేందర్, మారెడ్డి కొండల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనురాధ, మాజీ సర్పంచ్ బీరయ్య, పలుగుల నవీన్ కుమార్, మాజీ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నర హరి, యువజన విభాగం అధ్యక్షుడు ముక్యర్ల సతీశ్ యాదవ్, నాయకులు లింగం యాదవ్, శారాజీ రాజేశ్, గంధమల్ల మధు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని



జయభేరి, యాదగిరిగుట్ట, జులై 05 :

యాదగిరిగుట్ట పట్టణంలోని గోశాల హై స్కూల్ లో జూనియర్ సివిల్ కోర్టు జడ్జి చందేశ్వరి దేవి విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన సదస్సు జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా యాదగిరిగుట్ట జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి చందేశ్వరి దేవి, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు, యువత డ్రగ్స్ కు ఇతర చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలని వాటికి బానిసలు కాకూడదని జీవితంలో బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఎంఈఓ శరత్ యామిని, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి

- జాకట ప్రేమ్ దాస్



జయభేరి, మేడ్చల్, జులై 05 :

ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత అని ఎన్యుమరేషన్ పత్రాలను సరైన పద్ధతిలో నింపి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని బీజేపీ నాయకుడు జాకట ప్రేమ్ దాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం మేడ్చల్ సర్కిల్ కార్యాలయ పరిధిలోని అత్వెల్లి గ్రామంలోని 15వ బూత్‌లో స్థానిక బీఎల్ఓ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ బూత్ అధ్యక్షుడు జాకట బాబు రాజుతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఎన్యుమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాకట ప్రేమ్ దాస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఎన్యుమరేషన్ పత్రాలను నింపి తమ ఓటు హక్కును బాధ్యతగా సాధించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని స్థానిక బీఎల్ఓ అధికారులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. అదేవిధంగా కార్యక్రమాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి అవసరమైన అదనపు సిబ్బందిని నియమించాలని, లేకపోతే గడువులోగా ప్రక్రియను పూర్తి చేయడం కష్టసాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎన్యుమరేషన్ పత్రాల భర్తీకి అవసరమైన అన్ని చర్యలను అధికారులు చేపట్టాలని, లేకపోతే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలి

జయభేరి, యాదగిరిగుట్ట, జులై 05 :

యాదాద్రి భువనగిరి జిల్లాలోని కరోనా కంటే ముందు నడిపిన ఆర్టీసీ బస్సులని మళ్ళీ పునరుద్ధరణ చేయాలని యాదగిరిగుట్ట డిపో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ ని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి కోరారు. యాదగిరిగుట్ట డిపో వద్దకు సిపిఐ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి వెళ్లిన ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామాల నుండి మండలం పాటు జిల్లా కేంద్రాలకు ఆర్టీసీ బస్సులు నడపకపోవడం వల్ల ప్రయాణికులతో పాటు విద్యార్థులకు ఇబ్బందులు జరుగుతున్నందున యధావిధిగా ఆర్టీసీ బస్సు పునరుద్ధరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, పేరబోయిన మహేందర్, యాదగిరిగుట్ట మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నయీమ్, మజ్జిగ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షల నిధులు మంజూరు

జయభేరి, యాదగిరిగుట్ట :



తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం వెనుకబడిన కులాలన్నింటికీ అండగా ఉంటుందని, దర్జీల (మేర) సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. తన గెలుపులో మేర కులస్థులే కీలక పాత్ర పోషించారని, వారే నా బలమని ఆయన కొనియాడారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట పట్టణంలోని నూతనంగా నిర్మించిన మేర కుల సంక్షేమ భవనాన్ని ఆదివారం మేర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్ రాజాంతో కలిసి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భవనం ఏర్పాటు చేసిన బాంకెట్ హాల్ ను ప్రారంభించారు. అంతకుముందు మేర కుల సంక్షేమ భవనం ట్రస్ట్ చైర్మన్ పురుషోత్తం, ట్రస్ట్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. మేర కుల సోదరులు కష్టపడి ఈ సంక్షేమ భవనాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వాలు మేర కులాన్ని పూర్తిగా విస్మరించాయని, కానీ ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మేర కుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఆ కులానికి సముచిత గౌరవం కల్పించిందని గుర్తుచేశారు. మేర కుల ట్రస్టు సభ్యుల విజ్ఞప్తి మేరకు ఈసంక్షేమ భవనం సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అక్కడికక్కడే ప్రకటించారు. భవిష్యత్తులో మేర కార్పొరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆధునిక కాలంలో రెడీమేడ్ దుస్తుల వల్ల దర్జీలకు సవాళ్లు పెరిగినప్పటికీ, యువత ఆధునిక ఫ్యాషన్ డిజైనింగ్, డిజిటల్ టైలరింగ్, బొటిక్ నిర్వహణ కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్ రాజాం, స్థానిక ప్రజాప్రతినిధులు, మేర సంఘం నాయకులు, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులకు సన్మానం

- మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ మేయర్ అజయ్ యాదవ్ శుభాకాంక్షలు

జయభేరి, మేడ్చల్, జులై 05 :



మేడ్చల్ నియోజకవర్గంలో నూతనంగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, రొయ్యపల్లి మల్లేష్ గౌడ్‌లు ఆదివారం మేడ్చల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సహకారంతో, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్ ఆధ్వర్యంలో ఇటీవల ప్రకటించిన డివిజన్ అధ్యక్షుల నియామకాల నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు తమకు బాధ్యతలు అప్పగించినందుకు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సుధీర్ రెడ్డి, అజయ్ యాదవ్‌లు నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజలకు చేరువగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, పూడూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు కౌడే మహేష్ కురుమ, వీరమల్ల శ్రావణ్ కుమార్ గుప్తా, బత్తుల మధుకర్ యాదవ్, మేడ్చల్ సొసైటీ డైరెక్టర్ వెంకట్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు తొంట యాదయ్య, దుర్గం వెంకటేష్ ముదిరాజ్, చెర్వుకొమ్ము శేఖర్ గౌడ్, ఉదండపురం సత్యనారాయణ, పెగుడ శ్యాంరావ్, సద్ది ప్రకాష్‌రెడ్డి, పానుగంటి మహేష్‌కుమార్, మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లవంగు రాకేష్‌వంజరి, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి..

జయభేరి, శేరిలింగంపల్లి :

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ బండ ప్రధాన రహదారి నుండి శంషిగూడ వరకు రూ. 150 లక్షల అంచనావ్యయంతో నూతనంగా చేపడుతున్న లింక్ రోడ్డు, వరద నీటి కాల్వ నిర్మాణం పనులను మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాస రావుతో కలిసి పరిశీలించిన PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా PAC చైర్మన్ గాంధీ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని PAC చైర్మన్ గాంధీ తెలియచేసారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని PAC చైర్మన్ గాంధీ తెలియచేశారు. ఎల్లమ్మబండ ప్రధాన రహదారి నుండి శంషిగూడ కు కలిపే లింక్ రోడ్డు వలన ప్రజలకు ప్రయాణ సమయం తగ్గునని, ఇంధనం ఆదా అవుతుంది అని, ప్రజలకు సులభంగా గమ్యం చేరేలా ఈ లింక్ రోడ్డు ఎంతగానో దోహదపడుతుంది అని, వరద నీటి కాల్వ నిర్మాణం పనుల వలన నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని, సీసీ రోడ్డు, వరద నీటి కాల్వ నిర్మాణం పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని, అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని PAC చైర్మన్ గాంధీ చెప్పడం జరిగినది. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని PAC చైర్మన్ గాంధీ గారు అధికారులను ఆదేశించడం జరిగినది, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని PAC చైర్మన్ గాంధీ చెప్పడం జరిగినది. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, ఆల్విన్ కాలనీ డివిజన్, శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని PAC చైర్మన్ గాంధీ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ రవికుమార్, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి బట్టిని కలిసిన ఎమ్మెల్యే

జయభేరి, దేవరకొండ :

హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క ని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కలిశారు. ఈ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా, విద్యుత్ మౌలిక సదుపాయాల బలోపేతం, పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సంబంధిత పనులు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లైన్ల విస్తరణతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర ప్రధాన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బాలు నాయక్ విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రథమ కర్తవ్యమని, దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తెలిపారు.

## వైస్సార్సీపీలో కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తకి తగిన గుర్తింపు ఉంటుంది

- వైయస్సార్సీపీ యువజన విభాగం నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్



జయభేరి, పరవాడ:

పెందుర్తి మండలం రాంపురం వైస్సార్సీపీ కార్యాలయంలో జరిగిన యువజన విభాగం నాయకులు సమావేశంలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతిఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని ప్రతి ఒక్కరూ పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తు పార్టీ పిలుపు మేరకు ప్రతి కార్యక్రమం గ్రామ స్థాయి నుండి చేయిపడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలుకు జరుగుతున్న మోసలు గురించి వివరించాలని అని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్ రాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి కోరాడ చందు యాదవ్, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు పెద్దిశెట్టి శేఖర్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు వేపాడ శ్రీను, ప్రధాన కార్యదర్శి కావలి శ్రీనివాస్, కార్యదర్శి లు బట్టు సతీష్ రెడ్డి, సేనాపతి దుర్గా, మండల యువజన విభాగం అధ్యక్షులు బండారు శ్రవణ్ కుమార్ (పరవాడ), బొకం శ్రవణ్(సబ్బవరం), మూలంపాక దిలీప్ కుమార్ (పెందుర్తి) వార్డు, గ్రామ, సచివాలయం యువజన విభాగం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు

**పరవాడ పశు సంవర్ధక శాఖ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ డా.రామకృష్ణ కీర్తి**

**జయభేరి, పరవాడ:**

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జులై 6 వ తేదీన పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేయనున్నామని పశు సంవర్ధక శాఖ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ డా.రామకృష్ణ కీర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.పరవాడ మండలంలో పరవాడ ప్రాంతీయ పశువైద్యశాలలో లంకెలపాలెం మరియు వాడచీపురుపల్లి పశు వైద్యశాలల్లో ఉచితంగా టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఇందుకోసం పరవాడ మండల వ్యాప్తంగా 2400 యాంటీ రేబీస్ టీకాలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు



టోల్ ఫ్రీ నెంబర్ 1962 ను లేదా దగ్గర్లోని పశువైద్యశాలలో గానీ, సమీప రైతు సేవా కేంద్రంలో గాని సంప్రదించాలని పశువుల పెంపకం దారులకు, రైతులకు, ప్రజలకు మరియు పశువైద్యులకు సూచించారు.ఈ జూనోటిక్ వ్యాధుల గురించి ప్రజలను అప్రమత్తం చేసి, జూనోటిక్ రోగాల బారిన పడకుండా చేయడమే ప్రపంచ జూనోసిస్ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని ఆయన తెలిపారు.పశుపక్ష్యాదులతో మెలిగే పశువైద్యులు, రైతులు, వధశాల కార్మికులకు మరియు పెంపుడు జంతువులతో సన్నిహితంగా ఉండే వారికి ఎక్కువగా ఈ వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. ప్రధానంగా వీరికి రేబిస్, ఆంత్రాక్స్, బ్రుసుల్లోసిస్,* క్షయ మొదలైన వ్యాధులు వచ్చే అవకాశముందన్నారు. ఇందులో రేబిస్ చాలా ప్రమాదకరమైన ప్రాణాంతకమైన వ్యాధి అని తెలిపారు. జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ప్రజలకు పశుసంవర్ధక శాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. పశువుల పెంపకం దారులు, రైతులు మరియు ప్రజలు జూనోటిక్ వ్యాధులపై అవగాహన పెంచుకొని, తగిన నివారణ చర్యలు తీసుకొని,ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పరవాడ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా.రామకృష్ణ కీర్తి ఒక ప్రకటనలో కోరారు.



## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

**దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్**

**లక్ష్మీ పల్లిలో ధ్వజస్థంభ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే**

**జయభేరి, దేవరకద్ర :**

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. అందులో బాగానే రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను విడుదల చేస్తుందన్నారు. దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం లక్ష్మీ పల్లిలో ఆదివారం దేవాలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవ పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ ప్రతిరోజు ఆధ్యాత్మికతకు సమయం కేటాయించడానికి ప్రయత్నించాలన్నారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్ కు కార్యక్రమ నిర్వాహకులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు, కార్యక్రమ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# బెల్ట్ షాపుల బరితెగింపు

**రూ.99 మద్యం పేరుతో రూ.150 దోపిడీ**

**జయభేరి, అనకాపల్లి:**



ప్రభుత్వం రూ.99కే నాణ్యమైన మద్యం అందిస్తాం అని హామీ ఇచ్చినా, అనకాపల్లి జిల్లాలో తోటాడ, అనకాపల్లి, కసింకోట, చోడవరం, మాడుగుల మండల ప్రాంతాల్లో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉండడంతో అక్కడ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ధర రూ.99గా ఉన్న మద్యం సీసాలపై ఉన్న ఎమ్మార్పీ స్టిక్కర్లను తొలగించి, బెల్ట్ షాపుల్లో ఒక్కో సీసాను రూ.150కు విక్రయిస్తున్నారని దీంతో ప్రతి సీసాపై వినియోగదారుడిపై అదనంగా రూ.51 భారం పడుతోందని కొన్ని బెల్ట్ షాపుల్లో కల్తీ మద్యం, స్పిరిట్ కలిపిన మద్యం విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈలాంటి మద్యం సేవించిన కొందరు అసాధారణంగా ప్రవర్తిస్తూ ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం బెల్ట్ షాపులను నిర్మూలిస్తామని ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం విచ్చలవిడిగా అక్రమ మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని పాఠశాలలు, జనావాసాలు, ప్రధాన రహదారుల సమీపంలో కూడా బెల్ట్ షాపులు యథేచ్ఛగా కొనసాగుతుండడంతో ప్రజలు ప్రభుత్వం విధానాలుపై ఆశహనం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఎక్సైజ్ అధికారులు, పోలీసు అధికారులకు, టోల్ ఫ్రీ నంబర్ 14405కు ఫిర్యాదులు చేసినా ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని వారు వాపోతున్నారు. సంబంధిత అధికారుల స్పందన లేకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయాలు జరిగేలా కఠిన చర్యలు తీసుకోవాలని అక్రమ బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలని కల్తీ మద్యం విక్రయాలపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలని అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అక్కడ స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## భారతదేశ సంస్కృతిని పరిరక్షించుకుందాం

**బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి**

**లక్ష్మీ పల్లిలో ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన పూజ**

**జయభేరి, దేవరకద్ర :**

భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు చాలా గొప్పవని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి(కే పి ఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం లక్ష్మీ పల్లి లో ఆదివారం స్థానిక ఆంజనేయ స్వామి గుడి వద్ద నూతన ధ్వజ స్థంభ ప్రతిష్టాపన పూజా కార్యక్రమానికి ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రశాంత్ రెడ్డి ప్రసంగించారు. అన్ని దేశాల కంటే మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలు చాలా గొప్పది. వని అన్నారు. వాటిని పది కాలాలపాటు పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దీనికి గాను ప్రతి ఒక్కరు కృషి చేద్దామన్నారు. లక్ష్మీ పల్లిలో ఇలాంటి పూజా కార్యక్రమాలను నిర్వహించడం సంతోషకరమైన విషయం అన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో నిర్వాహకులకు ప్రశాంత్ రెడ్డి అభినందించారు. పూజా కార్యక్రమానికి హాజరైన కొండ ప్రశాంత్ రెడ్డిని కార్యక్రమ నిర్వహకులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి దేవరకద్ర మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణంరాజు తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కౌకుంట్లలో యానగుంది మౌలాలి పీర్ల వేడుకలు

**8 రాత్రి, 9న ఉదయం వేళల్లో పీర్ల ఊరేగింపు**

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కౌకుంట్ల మండల కేంద్రంలో యానగుంది మౌలాలి పీర్ల వేడుకలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రతి ఏడాది మొహరం వేడుకలు ముగిసిన కొన్ని రోజుల తర్వాత గ్రామంలో యానగుంది మౌలాలి పీర్ల వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పీర్ల వేడుకలను సాంప్రదాయ రీతిలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు పీర్ల చావిళ్ళ వద్ద పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహిస్తున్నారు. దీంతో పీర్ల వేడుకల ప్రాంతం భక్తులతో కిటకిటలాడుతుంది. అలై, బలై ఆడుతున్నారు. మొక్కుబడి గల భక్తులు పీర్లపై దట్టీలు కప్పి, మాలిదల తో ఫాతేహాలు ఇచ్చి తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. కొంతమంది పీర్లకు వెండి వస్తువులను సమర్పిస్తున్నారు. పీర్ల వేడుకల సందర్భంగా మసీదును రంగురంగు విద్యుత్ బల్బులతో శోభాయమానంగా అలంకరించారు.పీర్ల వేడుకల్లో భాగంగా ఈనెల 8న రాత్రి గ్రామంలో యానగుంది మౌలాలి పీర్ల ఊరేగింపు కొనసాగనుంది. అలాగే 9న ఉదయం పీర్ల ఊరేగింపు నిర్వహించనున్నారు. ఆ రోజుతో పీర్ల వేడుకలు ముగియనున్నాయి.

# ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు ఆయా పోస్టుల మెరిట్ లిస్ట్ విడుదల

**దంతాలపల్లి ఎంఈఓ శ్రీదేవి**

**జయభేరి, దంతాలపల్లి, జులై 05 :**



మండలంలోని 4 ప్రీప్రైమరీ పాఠశాలల ఇన్స్ట్రక్టర్లు ఆయా పోస్టుల తాత్కాలిక మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ చేసున్నట్లు దంతాలపల్లి ఎంఈఓ శ్రీదేవి పత్రికా ప్రకటనలో తెలియజేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దంతాలపల్లి మండల పరిధిలోని ప్రీప్రైమరీ విభాగానికి మంజూరైన 4 పాఠశాలలలో ఇన్స్ట్రక్టర్లు మరియు ఆయా పోస్టుల నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ జాబితా మండల విద్యాశాఖ కార్యాలయం (MEO Office)లో ప్రదర్శించబడినది. అభ్యర్థులు ప్రదర్శించబడిన తాత్కాలిక మెరిట్ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు లేదా వివరాలలో వ్యత్యాసాలు ఉన్నట్లయితే, సంబంధిత ఆధార ధ్రువపత్రాలతో కలిసి 06 072026 (సోమవారం) సాయంత్రం 5.00 గంటలలోపు మండల విద్యాశాఖ అధికారికి (MEO), దంతాలపల్లి కు లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు. నిర్దేశించిన గడువు అనంతరం అందిన అభ్యంతరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబడవని, కావున సంబంధిత అభ్యర్థులు తప్పనిసరిగా గడువులోపు తమ అభ్యంతరాలను సమర్పించుకోవాలని కోరారు. అందిన అన్ని అభ్యంతరాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలించిన అనంతరం తుది మెరిట్ జాబితా జిల్లా విద్యా శాఖధికారిచే విడుదల చేయబడుతుందని మండల విద్యా శాఖ అధికారి తెలిపారు.



## వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే సోదరుడు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం బస్వాపూర్ లో ఆదివారం కొత్త కాపు తిరుపతిరెడ్డి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు జి.భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు తమ కుటుంబం తరపున నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ సర్పంచ్ కుమారుడి వివాహ వేడుకల్లో కూడా భాస్కర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. దేవరకద్ర మున్సిపాలిటీలోని 6వ వార్డు లోనున్న మేస్త్రి వెంకటయ్య, సత్యమ్మ ల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకల్లో కూడా భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ తమ కుటుంబం తరపున లబ్ధిదారులకు కొత్త వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలి

**మహబూబ్ నగర్ జిల్లా టిఎస్ జిహెచ్ యంఏ డిమాండ్**


**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లాలోని జిహెచ్ఎం (గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు)లకు వెంటనే పదోన్నతులు ఇవ్వాలని మహబూబ్ నగర్ జిల్లా తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్మాస్టర్ అసోసియేషన్ (టి ఎస్ జి హెచ్ ఎం ఏ) డిమాండ్ చేసింది. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్.గిరిధర్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు అనంతప్ప, ప్రధాన కార్యదర్శి జగదీష్ కుమార్, కోశాధికారి అబ్దుల్ హక్, జగన్నాథ్ రమేష్ లు మాట్లాడారు. జిహెచ్ఎంలు గత 23 సంవత్సరాలుగా పదోన్నతులు లేకుండా పదవి విరమణ పొందుతున్నారని వారు ఆవేదన వ్యక్తపరిచారు. కావున వారికి డిప్యూటీ ఈఓ, సీనియర్ డైట్ లెక్చరర్లు, జిహెచ్ఎం గ్రేడ్1లుగా పదోన్నతులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఎంఈఓ పోస్టులు అప్డేట్ చేసి ప్రతి మండలానికి రెగ్యులర్ ఎంఈఓ లను నియమించాలని వారు కోరారు. ప్రతి 4 మండలాలకు ఒక డిప్యూటి ఈఓ పోస్టులను లేదా నియోజకవర్గానికి ఒక డిప్యూటీ ఈఓ పోస్టును మంజూరు చేయాలన్నారు. జిహెచ్ఎంలకు బదిలీలు నిర్వహించి పదోన్నతులు కల్పించాలన్నారు. ఎండిఎం బాధ్యతలనుండి జిహెచ్ఎంలను తప్పించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడి స్థాయిలో కంప్యూటర్ ఆపరేటర్ మంజూరు చేయాలన్నారు. అన్ని ఉన్నత పాఠశాలలకు జూనియర్ అసిస్టెంట్ మరియు ఓఎస్ లను మంజూరు చేయాలన్నారు. జడ్పీ జిపిఎఫ్ నుండి అందరూ జిహెచ్ఎం లకు ప్రభుత్వ జిపిఎఫ్ నెంబర్ ఇవ్వాలన్నారు. పాఠశాలలో స్వీపర్ పోస్ట్ ఉన్న సానిటరీ వర్కర్స్ లను ఇవ్వాలన్నారు. కంప్యూటర్స్ లను సరఫరా చేసిన అన్ని ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్స్ బోధకులను నియమించాలని ఆ సంఘం సభ్యులు కోరారు.

## జానంపేటలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం

**హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్**



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని మూసాపేట మండలం జానంపేట లో ఆదివారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం సంబరంలా జరిగింది. ఈ కార్యక్రమానికి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తమ కుటుంబం తరఫున నూతన వస్త్రాలు అందజేసి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికి తిలకం దిద్దారు. గ్రామస్తులు డప్పు, వాయిద్యాలతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధికి మారుపేరు బీరప్ప గడ్డ

- రూ. 89 లక్షలతో చిల్కానగర్, బీరప్ప గడ్డ డివిజన్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన.. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- మాట ఇచ్చా.. పనిచేయించి చూపించా... బన్నాల
- అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ బీరప్ప గడ్డ డివిజన్.. మాజీ కార్పొరేటర్ బన్నాల గీత



జయభేరి, ఉప్పల్ :

బీరప్ప గడ్డ, చిలుక నగర్ డివిజన్లలో సుమారు 89 లక్షల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు జిహెచ్ఎంసి మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి శంకుస్థాపన చేసిన ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి బీరప్ప గడ్డ డివిజన్ లో ప్రశాంత్ నగర్, న్యూ ప్రశాంత్ నగర్ కాలనీలో రూ. 41 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న CC రోడ్డుకు శంకుస్థాపన, ధర్మపురి కాలనీలో రూ. 31 లక్షల వ్యయంతో CC రోడ్ కు శంకుస్థాపన, రూ. 11 లక్షల వ్యయంతో బీరప్ప గడ్డ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన. చిలుక నగర్ డివిజన్లో రూ. 6 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీవరేజ్ పైప్ లైన్ నిర్మాణానికి శంకుస్థాపన. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్లో ఎంతో అభివృద్ధి చేశామని, ఉప్పల్ నియోజకవర్గం లోనే చిల్కానగర్ డివిజన్లో చేసినన్ని అభివృద్ధి పనులు ఏ డివిజన్లో జరగలేదని, కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఒక ప్రణాళిక బద్ధంగా డివిజన్ ని ఒక రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతున్నారని అభినందించారు.

అదేవిధంగా ఉప్పల్ నియోజకవర్గంలో అన్ని చెరువులకు సుమారు 100 కోట్ల నిధులు సేకరించామని అన్ని చెరువులని బ్యూటీఫికేషన్ లో భాగంగా అభివృద్ధి చేస్తున్నామని కొనియాడారు. మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి సహకారంతో చిల్కానగర్, బీరప్ప గడ్డ డివిజన్లకు పెద్ద ఎత్తున నిధులు వచ్చాయని ఈరోజు చిలికా నగర్ నంబర్ 1 స్థానంలో ఉండడానికి ఎమ్మెల్యే ముఖ్య కారణం, వారి సహకారం ఎంతో ఉందని, డివిజన్లో ఇంకా కొన్ని వీధుల్లో సిసి రోడ్ల నిర్మాణం స్ట్రామ్ బోర్డర్ డ్రైన్ ల నిర్మాణం ముఖ్యంగా కమ్యూనిటీ హాల్ లో నిర్మాణం కూడా చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి సహకారంతో ఇవన్నీ కూడా దశలవారీగా పూర్తి చేస్తానని అన్నారు.

అదేవిధంగా చిలుక నగర్, బీరప్ప గడ్డ డివిజన్ ప్రజల తరపున ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కొక్కొండ జగన్ , పండ్ల కిషన్ గౌడ్, కోళ్ల రవి కుమార్ గౌడ్, బాణాల నారాయణరెడ్డి, బింగి శీను, తిరుపతి యాదవ్, రవి, vb నరసింహ,జల్లి మోహన్,బాలకృష్ణగౌడ్, రామాంజనేయులు, మాస శేఖర్, మార్క శ్రీను, బీరప్ప గడ్డ బాలు,అసద్, బంటి గౌడ్, బాలేందర్ భాస్కర్, వెంకట్ రెడ్డి, శివ, ధర్మపురి కాలనీ, ప్రశాంత్ నగర్, న్యూ ప్రశాంత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు , ఉప్పల్ పుర ప్రముఖులు సళ్ల వీరారెడ్డి, చల్ల రాజిరెడ్డి, మహంకాళి నరసింహ, గుమ్మడిల్లి మల్లేష్, దిక్కుమల్ల చంద్రుడు, ఉప్పల్ కుమ్మరి సంఘం సభ్యులు, మొదలగువారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## సభ్యులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం

- ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ బ్యూరో (ఇండియా) సభ్యులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.

జయభేరి, కాప్రా :

కుషాయిగూడలోని కాప్రా ప్రెస్ క్లబ్ వేదికగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ బ్యూరో (ఇండియా) ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన సభ్యులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజంలో మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, సేవా భావంతో ప్రజలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం పనిచేసే సంస్థలు సమాజంలో చైతన్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సభ్యులు నిబద్ధతతో సేవలందిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందిస్తూ, సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు BRS పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ



జయభేరి, కాప్రా :

డాక్టర్ ఏ.ఎస్.రావు నగర్‌లోని బస్తీ దవాఖాన ఎక్స్‌టెన్షన్ భవనం ప్రారంభోత్సవం, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవం నిర్వహించి అనంతరం సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, పరిశుభ్రమైన పరిసరాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బస్తీ దవాఖానల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం వల్ల పారిశుద్ధ్యం మెరుగుపడి ప్రజల ఆరోగ్యం మరింత రక్షించబడుతుందని పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతి మౌలిక సదుపాయాన్ని కల్పించేందుకు తాను నిరంతరం కృషి చేస్తున్నానని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ DMHO గీత మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు గారు BRS పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి మాజీ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి కె. సోమశేఖర రావు జి. వీరయ్య ఐ. శివ శంకర రావు ఎస్. శంకర రావు ఎ. వెంకటేశ్వర రావు సి. చంద్రశేఖర్ BRS పార్టీ నాయకులు కార్యకర్తలు డాక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్ఓల ఇంటింటికీ ఓటరు నమోదు ప్రక్రియ

- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమాన్ని పరిశీలించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి



జయభేరి, శేరిలింగంపల్లి :

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వెంకటేష్ నగర్, రోడ్ నెం. 6లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (SIR) ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి బూత్ లెవెల్ అధికారులతో (BLOలు) కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా అవసరమైన వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా, ప్రజలు బీఎల్ఓలు అందించే ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా నింపి సమర్పించాలని కోరారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్న ఆయన, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె.ఎం. గౌరీష్, యువ నాయకులు కె.ఎం. గిరి, శ్రీధర్ రెడ్డి, భగవాన్ రెడ్డి, మనోహర్, గణేశ్వర్, రమేష్, శ్రీనివాస్, రాజు, జ్యోతి, సీతారామయ్య, పాండురికం, జగదీశ్వర్ రావు, మహేష్ కుమార్, గిరి, సుబ్రహ్మణ్యం, సుబ్బయ్య, కుమార్, బూత్ లెవెల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కేటీఆర్ కీ స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

- కన్నెపల్లి పంపు హౌస్ సందర్శించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు



జయభేరి, భూపాలపల్లి :

కాంగ్రెస్ సర్కార్ కు చేతకాక పోతే కేసీఆర్ కి అప్పజెప్పండి,మోటార్లు ఆన్ చేసి వారం రోజుల్లోపే అన్ని జలాశయాలు నింపి చూపెడుతామని కేటీఆర్ అన్నారు. మేడిగడ్డ వద్ద లక్ష క్యూసెక్కుల నీళ్లు ప్రవహిస్తూ వృధాగా పోతుంటే మోటార్లు ఎందుకు ఆన్ చేస్తలేరు...? నీళ్లు ఎందుకు ఎత్తి పోస్తలేరని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన చల్లో కన్నెపల్లి పంపు హౌస్ కార్యక్రమంలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావుతో కలిసి పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, భూపాలపల్లి నియోజకవర్గ నాయకులతో కలిసి, భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు.





## సీసీ కెమెరాల 24 గంటలపాటు నిఘా నేత్రాలు



జయభేరి, హైదరాబాద్ :

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ బండ కేటీఆర్ కాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో రూ. 80 వేల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 10 సి. సి కెమెలరాను SI శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావుతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల 24 గంటలపాటు నిఘా నేత్రాలుగా పనిచేస్తాయి అని, సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం చాలా సంతోషకరమైన విషయం, ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచారు అని, కాలనీ అసోసియేషన్ వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను అని PAC చైర్మన్ గాంధీ తెలియచేశారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అని ఎంత పెద్ద నేరం చేసిన దొంగతనాలు సీసీ కెమెరాలతో దొరికిపోతారు అని, సాక్ష్యాధారలను చేర్పలేమని, అన్ని నిక్షిప్తం అవుతాయి అని నేటి సమాజంలో ప్రజల ప్రాణ, ఆస్తుల భద్రతకు సీసీ కెమెరాలు అత్యంత అవసరమైన భద్రతా సాధనంగా మారాయని అన్నారు. కాలనీలు, ప్రధాన రహదారులు, కూడళ్లు, పార్కులు, దేవాలయాలు, విద్యాసంస్థలు వంటి ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలను అరికట్టడంలో, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడంలో, దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడంలో ఎంతోగానో ఉపయోగపడుతాయి అని PAC చైర్మన్ గాంధీ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ సీసీ కెమెరాలు కాలనీలో భద్రతను మరింత బలోపేతం చేయడమే కాకుండా మహిళలు, చిన్నారులు, వృద్ధులు నిర్భయంగా సంచరించే వాతావరణాన్ని కల్పిస్తాయని PAC చైర్మన్ గాంధీ తెలియచేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజల సంక్షేమానికి వినియోగించుకోవడం ద్వారా భద్రమైన, ప్రశాంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, కాలనీ అభివృద్ధి అనేది కేవలం మౌలిక వసతులకే పరిమితం కాదని, పరిశుభ్రత, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీతో పాటు భద్రత కూడా అంతే ముఖ్యమని PAC చైర్మన్ గాంధీ తెలిపారు. ప్రజల సహకారం ఉంటే ప్రతి కాలనీని ఆదర్శవంతమైన, సురక్షితమైన కాలనీగా తీర్చిదిద్దడమే లక్ష్యం అని, కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగినది అని, ఆల్విన్ కాలనీ డివిజన్ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని PAC చైర్మన్ గాంధీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.





## మత్స్యకారులకు చేపల వేట నిషేధిత జీవన భృతిని అందించాలి

- పెసరు కుమారస్వామి ముదిరాజ్

జయభేరి, కరీంనగర్ :

మత్స్యకారులకు చేపల వేట నిషేధిత భృతిని అందించాలని మత్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కరీంనగర్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ పెసరు కుమారస్వామి ముదిరాజ్ కోరారు. తెలంగాణ రాష్ట్ర మత్స్య శాఖ అధికారులు జీవో నెంబర్ 186 /1995 ప్రకారం రిజర్వాయర్, చెరువులలో చేపలు సంతానోత్పత్తి సమయం కాబట్టి చేపలు పట్టకూడదని నిషేధిత సమయం జూలై 1 నుండి ఆగస్టు 31 వరకు నిబంధనలు విధించారు, కరీంనగర్ జిల్లాలో 15 వేలమంది మత్స్యకారులు చేపల వృత్తిపై ఆధారపడుతున్నారు ఈ రెండు నెలలు నిషేధిత సమయం విధించడంతో మత్స్యకారుల కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉంది, కావున ఏదైతే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో జీవో నెంబర్ 186 /1995 ను అమలులోకి తీసుకొచ్చారు అదే జీవోలో పొందుపరిచిన విధంగా చేపల వేట నిషేధిత సమయంలో మత్స్యకారులకు చేపల వేట నిషేధిత బృతిని అందించాలని జీవలో పొందుపరచడం జరిగింది ఆ జీవో ను అనుసరిస్తూ పక్క న ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు నిషేధిత బృతిని 20వేల రూపాయలు అందిస్తుంది, తెలంగాణ రాష్ట్రంలోని మత్స్యకారులకు కూడా నిషేధిత భృతి ని అందించె విధంగా చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు.

## కనిపించుట లేదు



జయభేరి, మేడిపల్లి :

ఫిర్యాదుదారుడు భీమ్ రెడ్డి నగర్ కు చెందిన పాండల శంకరయ్య, ఇద్దరు కుమార్తెలు, అందులో చిన్న కూతురు అయినటువంటి పాండల శైలజ (35) , మతిస్థిమితం సరిగా వుండదు. రోజు మాదిరి లాగా తన అక్క భాను ఇంటిలో పడుకొనుటకు వెళ్ళినధి. 05.07.2026 నాడు ఉదయం రెండు నుంచి మూడు గంటల ప్రాంతంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని మేడిపల్లి పోలీసు వారికి తెలియజేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయుచున్నారు.



# వర్షాకాలంలో బట్టల దుర్వాసనతో ఇబ్బందా?

**వర్షాకాలంలో దుస్తులు త్వరగా ఆరకపోవడం, వాటి నుంచి దుర్వాసన రావడం చాలా సాధారణం. తేమతో కూడిన వాతావరణం వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. అయితే, కొన్ని సులభమైన చిట్కాలను పాటిస్తే, ఈ దుర్వాసనను సులభంగా దూరం చేసుకోవచ్చు. వర్షాకాలం వచ్చిందంటే చాలు, వాతావరణం చల్లగా, తేమగా మారుతుంది. ఈ సమయంలో దుస్తులు ఆరడానికి చాలా సమయం పడుతుంది.**

మూడు, నాలుగు రోజులు గడిచినా బట్టలు తడిగా ఉండిపోవడం, వాటి నుంచి చెడు వాసన రావడం చాలామందికి ఎదురయ్యే సమస్య. ఎంత పెర్ఫ్యూమ్ కొట్టినా ఆ వాసన వదలదు, ఫలితంగా ఆ దుస్తులు ధరించడం కష్టంగా మారుతుంది.

### 1. నిమ్మరసంతో దుర్వాసనకు చెక్:

మీరు దుస్తులు ఉతికేటప్పుడు వాడే సర్ఫ్‌లో (డిటర్జెంట్‌లో) కొద్దిగా నిమ్మరసం కలపడం వల్ల దుర్వాసన రాకుండా ఉంటుంది. నిమ్మరసంలో ఉండే విటమిన్ సి వాసనను తొలగించడమే కాకుండా, దుర్వాసనకు కారణమయ్యే బ్యాక్టీరియాను కూడా చంపుతుంది. ఇది దుస్తులకు సహజమైన సువాసనను అందిస్తుంది.

### 2. బేకింగ్ సోడా:

దుస్తులు ఉతికే డిటర్జెంట్‌లో బేకింగ్ సోడా కలపడం వల్ల కూడా మంచి ప్రయోజనాలు కలుగుతాయి. బేకింగ్ సోడా ఒక అద్భుతమైన వాసన నివారిణి. ఇది దుస్తులలోని చెడు వాసనలను గ్రహించి తొలగిస్తుంది. అలాగే, ఉతికిన తర్వాత దుస్తులకు మంచి సువాసన కోసం కంఫర్ట్ వంటి ఫ్యాబ్రిక్ సాఫ్టెనర్‌లను ఉపయోగించడం వల్ల కూడా మంచి ఫలితాలు ఉంటాయి.

### 3. కర్పూరం బిళ్ళతో సువాసన:

వర్షాకాలంలో దుస్తుల నుంచి దుర్వాసనను పోగొట్టడానికి కర్పూరం బిళ్ళలు కూడా చాలా ఉపయోగపడతాయి. దుస్తులు ఆరిన తర్వాత లేదా వాటిని అలమరాలో భద్రపరిచేటప్పుడు, కొన్ని కర్పూరం బిళ్ళలను దుస్తుల మధ్య ఉంచండి. కర్పూరం సహజంగా సువాసనను వెదజల్లి, దుస్తులకు తాజాగా ఉండేలా చేస్తుంది. ఇది తేమను కూడా కొంతవరకు గ్రహిస్తుంది.

### 4. వాషింగ్ మెషిన్, డ్రైయర్ వాడకం:

ఈ రోజుల్లో చాలామంది వాషింగ్ మెషిన్, డ్రైయర్లను ఉపయోగిస్తున్నారు. ఇవి దుస్తులను త్వరగా ఆరబెట్టడంలో సహాయపడతాయి. అయితే, కొన్నిసార్లు డ్రైయర్ వాడినా కూడా తేమ వల్ల దుర్వాసన రావొచ్చు. పైన చెప్పిన చిట్కాలు వాషింగ్ మెషిన్‌లో ఉతికిన దుస్తులకు కూడా వర్తిస్తాయి. డ్రైయర్‌లో ఆరబెట్టిన తర్వాత కూడా తేలికపాటి దుర్వాసన అనిపిస్తే, ఈ నిమ్మరసం, బేకింగ్ సోడా లేదా కర్పూరం చిట్కాలను పాటించవచ్చు. ఈ చిన్న చిన్న చిట్కాలను పాటించడం ద్వారా వర్షాకాలంలో మీ దుస్తులు తాజాగా, సువాసనభరితంగా ఉండేలా చూసుకోవచ్చు.



# పండ్లను కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

**పండ్లు మన ఆరోగ్యానికి ఎంత మంచివో మనందరికీ తెలుసు. డాక్టర్లు సైతం ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని చెబుతారు. కానీ చాలా మంది పండ్లను కోసి కొన్ని గంటల తర్వాత తింటారు. అయితే కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే అది మన శరీరం పై చెడు ప్రభావాన్ని చూపుతుంది.**


పండ్లు మన శరీరానికి మంచివని అందరికీ తెలుసు. ప్రతిరోజ పండ్లను తినడం ఆరోగ్యానికి మంచిది. విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ వంటివి పండ్లలో సమృద్ధిగా ఉంటాయి. పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని వైద్యులు సూచిస్తారు. కొన్నిసార్లు మనం పండ్లను కోసి అలాగే ఉంచుతాం. ఆఫీసులు, ఏదైన ప్రయాణ సమయాల్లో కోసి తీసుకెళ్తుంటారు. కొంతమంది కోసి ఫ్రిజ్‌లో పెడతారు. కొన్ని గంటల తర్వాత వాటిని తింటారు. కానీ కోసిన పండ్లను ఎంతసేపట్లో తినాలి..? అవి ఎంతకాలం మంచిగా ఉంటాయి అనేది చాలా మందికి తెలియదు. ఇవి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

### పండ్లు తినడానికి సరైన సమయం ఏమిటి?

పండ్లను ఏ సమయంలో తిన్న మంచిదేనని నిపుణులు అంటున్నారు. అయితే కొన్నింటిని ఉదయం ఖాళీ కడుపుతో, మరికొన్నింటిని రాత్రి వేళలో తినకూడదని చెబుతారు. ఏదైనా సరే మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని అంటున్నారు.

### కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

కోసిన వెంటనే పండ్లు చెడిపోవు. కానీ వాటిని ఎంత త్వరగా తింటే అంత మంచిది. నిజానికి కోసిన పండ్లలో ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరుగుతుంది. వేసవి, వర్షాకాలం సూక్ష్మజీవుల పెరుగుదలకు ఉత్తమ సమయాలు. ఈ సీజన్లలో కోసిన పండ్ల వల్ల ఇన్ఫెక్షన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఎక్కువసేపు నిల్వ చేయకుండా వీలైనంత త్వరగా వాటిని తినాలి. పండ్ల నుండి అన్ని పోషకాలను పొందడానికి వాటిని కోసిన అరగంటలోపు తినడం ఎల్లప్పుడూ మంచిదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.



# మహిళలు.. ఈ వ్యాయామాలతో పీరియడ్స్ నొప్పి దూరం..

**ఋతుక్రమ నొప్పి నుండి ఉపశమనం పొందడానికి సున్నితమైన వ్యాయామం గొప్ప మార్గం. కొన్ని ప్రభావవంతమైన వ్యాయామాలలో పెల్విక్ టిల్ట్‌లు, నడుము, గ్లూట్ స్ట్రెచింగ్‌లు, పిల్లల భంగిమ వంటి యోగా భంగిమలు ఉన్నాయి. నడక, ఈత, తేలికపాటి కార్డియో కూడా రక్త ప్రసరణను మెరుగుపరచడం, సహజ నొప్పి నివారణ మందులుగా పనిచేసే ఎండార్ఫిన్‌లను విడుదల చేయడం ద్వారా సహాయపడతాయి.**

### పెల్విక్ టిల్ట్స్ :

మీ మోకాళ్లను వంచి, పాదాలను నేలపై ఉంచి మీ వీపు మీద పడుకోండి. మీ పొత్తికడుపు కండరాలను నిమగ్నం చేస్తూ, మీ పెల్విస్‌ను మెల్లగా పైకి వంచండి. కొన్ని సెకన్ల పాటు అలాగే ఉండి, ఆపై విశ్రాంతి తీసుకోండి. దీన్ని 1015 సార్లు పునరావృతం చేయండి. ఇలా చేస్తే ఋతుక్రమ నొప్పి నుంచి బయటపవచ్చు.

### నడుము కింది భాగం, గ్లూట్ స్ట్రెచ్:

మీ కుడి పాదాన్ని ముందుకు, ఎడమ పాదాన్ని వెనుకకు ఉంచి, మడమను పైకి లేపి ప్రారంభించండి. మీ ముందు మోకాలిని వంచి, మీ చేతులను తలపైకి చాచండి. సాగదీసేటప్పుడు మీ తుంటిని కుడి వైపుకు బయటికి కదిలించండి. దీనివల్ల పీరియడ్ పెయిన్ దూరం అవుతుంది.

### పిల్లల భంగిమ:

నేలపై మోకరిల్లి మీ మడమల మీద తిరిగి కూర్చోండి. ముందుకు వంగి, మీ మొండెంను మీ తొడల మధ్య ఉంచండి. మీ చేతులను ముందుకు చాచండి లేదా వాటిని మీ వైపులా విశ్రాంతి తీసుకోండి. ఈ భంగిమను కొన్ని నిమిషాలు పట్టుకోండి. ఈ భంగిమ ద్వారా ఋతుక్రమ నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

### ఇతర ఉపయోగకరమైన వ్యాయామాలు:

సున్నితమైన యోగా భంగిమలు కండరాలను సడలించడానికి మరియు ఉద్రిక్తతను తగ్గించడానికి సహాయపడతాయి. చురుకైన నడక రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది మరియు నొప్పిని తగ్గిస్తుంది. నీటిలో ఈత సామర్థ్యం మద్దతు, సున్నితమైన వ్యాయామాన్ని అందిస్తుంది. కొన్ని పైలేట్స్ వ్యాయామాలు కోర్ కండరాలను బలోపేతం చేస్తాయి మరియు భంగిమను మెరుగుపరుస్తాయి.

### ముఖ్యమైన విషయాలు:

ఏదైనా వ్యాయామం నొప్పిని కలిగిస్తే, ఆగి విశ్రాంతి తీసుకోండి. భారీ వ్యాయామాలు కొన్నిసార్లు తిమ్మిరిని మరింత తీవ్రతరం చేస్తాయి. పుష్కలంగా నీరు త్రాగడం వల్ల కండరాల తిమ్మిరిని నివారించవచ్చు. హీటింగ్ ప్యాడ్ వేయడం లేదా వెచ్చని స్నానం చేయడం కూడా ఉపశమనం కలిగిస్తుంది.



# తొలిసారి అలాంటి మాటలు విన్నా..



వర్సటైల్ యాక్టర్ గా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు నటుడు సత్యదేవ్. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా చిన్న చిన్న పాత్రలు చేస్తూ ప్రేక్షకులను మెప్పించిన సత్యదేవ్ ఆతర్వాత హీరోగా మారి ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా రావు బహుదూర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. సూపర్‌స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో మోస్ట్ అవైటెడ్ సైకాలజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్'. కేరాఫ్ కంచరపాలెం సినిమాతో ఆకట్టుకున్న దర్శకుడు వెంకటేష్ మహా ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. 'రావు బహదూర్' చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. థియేటర్స్ లో ఈ సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తుంది. సినిమ పాజిటివ్ టాక్ తెచ్చుకోవడంతో చిత్రయూనిట్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రావు బహుదుర్ సినిమాలో సత్యదేవ్ తన నటనతో ప్రేక్షకులను వ్ విశేషంగా ఆకట్టుకున్నాడు. ఇక ఈ సినిమాలో దీపా థామస్ హీరోయిన్ గా నటించింది. మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఈ ముద్దుగుమ్మ తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది. తెలుగులో తొలి సినిమా అయినప్పటికీ తన నటనతో అలరించింది దీపా థామస్. ఈ సక్సెస్ మీట్ లో హీరోయిన్ దీపా థామస్. మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యింది. 9 ఏళ్ల నుంచి ఇండస్ట్రీలో ఉన్నా. కానీ ఈ సినిమా అవకాశం రావడంతో కల నిజమైంది. ఈ సినిమా ఛాన్స్ రావడం నిజంగా నా అదృష్టం. ఈ సినిమాలో సత్యదేవ్ లాంటి బ్రిలియంట్ యాక్టర్ తో కలిసి నటించా.. ఇక రెండేళ్లు ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. రీసెంట్ గా ఆడియన్స్ తో థియేటర్లో మూవీ చూశా. వాళ్లు సినిమా చూస్తూ నవ్వుతున్నారు, ఏడుస్తున్నారు. సినిమాలో అన్ని ఎమోషన్స్ ఆడియన్స్ కు కనెక్ట్ అయ్యాయి. మూవీ ఎమోషన్స్ తో పాటు ఆడియన్స్ క్యారీ అవుతున్నారు అని దీపా థామస్ చెప్తూ ఒక్కసారిగా ఎమోషనల్ అయింది. స్టేజ్ పైనే కన్నీళ్లు పెట్టుకుంది. నా పేరేంట్స్‌కు తెలుగు రాదు. వాళ్లు ఈ సినిమాని సబ్‌టైటిల్స్‌తో చూశారు. ఈ సినిమా చూసి మా నాన్న ఇంకా బాగా చేయాలని తొలిసారి నాన్న నాతో అన్నారు అంటూ కన్నీళ్లు పెట్టుకుంది.



# అఖిల్‌కు కొత్త పేరు పెట్టిన అభిమాని..

**'నాగ అఖిల్' వెనుక ఉన్న సెంటిమెంట్ తెలిస్తే షాకవుతారు!**

అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటించిన తాజా చిత్రం 'లెనిన్' జూలై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కించిన ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా తిరుపతిలో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్ అభిమానుల సందడితో ఎంతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిల్, నాగార్జున, చిత్రబృందం మాట్లాడిన విషయాలకంటే... ఓ అక్కినేని అభిమాని చేసిన వినూత్న ప్రయత్నమే అందరి దృష్టిని ఆకర్షించింది. అఖిల్‌కు కొత్త పేరును సూచిస్తూ అతడు చెప్పిన సెంటిమెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సాధారణంగా సినీ ఇండస్ట్రీలో కొందరు హీరోలు కెరీర్ బాగా సాగాలని లేదా జ్యోతిష్య సూచనల మేరకు తమ పేర్లలో అక్షరాలు జోడించడం, మార్చుకోవడం చూస్తుంటాం. అయితే ఇక్కడ మాత్రం అభిమానినే స్వయంగా అఖిల్‌కు కొత్త పేరు పెట్టడం ఆసక్తికరంగా మారింది. అతడు సూచించిన పేరు 'నాగ అఖిల్స. మొదట ఈ పేరు వినగానే సాధారణంగా అనిపించినా, దాని వెనుక ఉన్న భావాన్ని వివరించడంతో ఈవెంట్‌కు హాజరైన వారంతా చప్పట్లతో అభినందించారు. అభిమాని చెప్పిన ప్రకారం 'నాగ అఖిల్' అనే పేరులో అక్కినేని కుటుంబానికి చెందిన నలుగురు ప్రముఖుల పేర్లను ప్రతిబింబించేలా అక్షరాలను ఎంపిక చేశారట. 'నాగ' - అక్కినేని లెజెండ్ నాగేశ్వరరావు పేరు నుంచి, 'అ' - నానమ్మ అన్నపూర్ణమ్మ పేరు నుంచి, మళ్లీ 'నాగ' - తండ్రి నాగార్జున పేరు నుంచి, అ' - తల్లి అమల పేరు నుంచి తీసుకోవడం జరిగిందని అన్నారు. ఈ నలుగురి పేర్ల స్ఫూర్తి, ఆశీస్సులు ఎప్పుడూ అఖిల్‌తో ఉండాలని భావించి 'నాగ అఖిల్' అని పేరు పెట్టినట్లు ఆ అభిమాని తెలిపాడు. ఈ సెంటిమెంట్‌కు అక్కడున్న అభిమానులు ఫిదా అయ్యారు. అక్కినేని కుటుంబంలో 'నాగ' అనే పదానికి ప్రత్యేకమైన అనుబంధం ఉంది. అక్కినేని నాగేశ్వరరావు, నాగార్జున, నాగ సుశీల, నాగ చైతన్య.. ఇలా కుటుంబంలోని పలువురి పేర్లలో 'నాగ' ఉండటం తెలిసిందే. ఇప్పుడు అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ అఖిల్ పేరుకు కూడా 'నాగ'ను జోడించాలని అభిమాని చేసిన సూచన సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, పలువురు అభిమానులు కూడా 'నాగ అఖిల్' పేరు బాగుందని కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు అయితే 'లెనిన్' సినిమా ఘన విజయం సాధిస్తే ఈ కొత్త పేరు మరింత పాపులర్ అయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

# నాకు ఈ స్థాయిని ఇచ్చింది వారే



ప్రముఖ నటుడు డా.రాజేంద్రప్రసాద్ ఇటీవలే ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనను ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించింది. 'ఇది నా జీవితంలో మరిచిపోలేని సత్కారం. నాపై అభిమానంతో ఈ సత్కారాన్ని ఏర్పాటు చేసిన అందరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నాను. బాపు, జంధ్యాల, వంశీ లాంటి దర్శకులు అద్భుతమైన పాత్రలు రాయడం వల్లే నేను ఇలా ఉన్నాను. నాకు పద్మశ్రీ రావడం ఆలస్యమైందని చాలామంది అంటున్నారు. వారి అభిమానానికి ధన్యవాదాలు. తెలుగువారందరి హృదయాల్లో రాజేంద్రప్రసాద్ ఉన్నాడు.అదే పెద్ద అవార్డ్. అయిదు జనరేషన్లు దాటి వచ్చాను. ఇప్పటి దర్శకులు కూడా నాకు మంచి పాత్రలు రాస్తున్నారు. ఎక్కడా రిలాక్స్ అయ్యే మనస్తత్వం కాదు నాది. ఇంకా మరిన్ని మంచి పాత్రలు పోషించి, మీకు మరింత వినోదాన్ని పంచేందుకు ప్రయత్నిస్తా' అని డా.రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ క్రిటిక్స్ గౌరవ అధ్యక్షులు ప్రభు, అధ్యక్షులు బత్తుల ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి సురేశ్ కొండేటి, ఉపాధ్యక్షులు జనార్ధన్, అబ్దుల్, ట్రెజరర్ భరద్వాజ్, సీనియర్ పాత్రికేయులు మామిడాల గిరిధర్, మోహన్ గోటేటి, ఉమర్‌జీ అనూరాధ, లక్ష్మణరావు, ఆర్‌డీఎస్ ప్రకాశ్, నవీన్, బాలిరెడ్డి, భూషన్ కూడా మాట్లాడారు.

# ఏపీకి ముఖ్యమంత్రి కావాలనే కోరిక ఉందా..



జూనియర్ ఎన్టీఆర్ గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత, రాజకీయ అభిప్రాయాలను నిర్భయంగా పంచుకున్నారు. బాలకృష్ణ పట్ల తనకున్న అమితమైన ప్రేమ, తెలుగుదేశం పార్టీ పట్ల తన నిబద్ధత, తన రాజకీయ ఆకాంక్షలపై స్పష్టతనిచ్చారు. నందమూరి బాలకృష్ణ అంటే తనకు ఎంతో ఇష్టమని జూనియర్ ఎన్టీఆర్ పదే పదే నొక్కి చెప్పారు. "బాల బాబాయ్ అంటే చాలా ఇష్టం. చాలా అద్భుతమైన మనిషి, చాలా మంచి మనిషి" అని అన్నారు. బాలకృష్ణ మూడీగా ఉంటారన్న బయట అభిప్రాయాలను ఖండిస్తూ, అవి "తెలిసి తెలియకుండా వాగడం" వంటివని కొట్టిపారేశారు. నందమూరి కుటుంబంలో బాలకృష్ణ తనకు ఎంతో ప్రత్యేకమని ఎన్టీఆర్ స్పష్టం చేశారు. తాతగారి వారసత్వాన్ని ఎప్పుడు తీసుకుంటారు అంటూ రాజకీయ భవిష్యత్తుపై అడిగిన ప్రశ్నకు జూనియర్ ఎన్టీఆర్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు. తాను ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకి కార్యకర్తని అని, జీవితాంతం పార్టీ ఉప్పు తిని బ్రతకాలని కోరుకుంటున్నానని చెప్పారు. "ఫ్యూచర్ అంటారా అది ఎవరం ఏమి చెప్పలేం. దాని గురించి మనం ఇప్పుడే మాట్లాడి ప్రయోజనం లేదు" అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవిపై తనకు ప్రస్తుతానికి ఎటువంటి ఆలోచన లేదని, అటువంటి ఆలోచన ఎప్పుడు మొదలైతే అప్పుడే వెల్లడిస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి కావడానికి కేవలం ఆశ ఉంటే సరిపోదని, సాధన ఉండాలి అని ఆయన బలంగా చెప్పారు. డెస్టినీని నమ్ముతానని, రాతలో ఉంటే జరుగుతుందని, లేకపోతే ఎంత ప్రయత్నించినా కాదని అన్నారు.

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, తన తాతగారు నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీ పట్ల తనకు, తన కుటుంబానికి అపారమైన విశ్వాసం ఉందని జూనియర్ ఎన్టీఆర్ అన్నారు. "పసుపు జెండాను చూస్తే మాకు ఏమవుతుందో తెలియదు నర నరాన పూనకం వస్తుందని" అని తన భావోద్వేగాన్ని వ్యక్తం చేశారు. తాతగారు ఎన్టీఆర్‌ని పదవి నుంచి తొలగించి చంద్రబాబు నాయుడు పార్టీని టేక్ ఓవర్ చేసిన ఎపిసోడ్ గురించి అడిగినప్పుడు జూనియర్ ఎన్టీఆర్ చాలా సున్నితంగా స్పందించారు. ఒక మనవడిగా, తన తాతగారు బ్రతికి ఉంటే బాగుండేది అని, తన సక్సెస్ చూసేవారని భావిస్తానని అన్నారు. అయితే, ఒక సాధారణ వ్యక్తిగా చూసినప్పుడు, అప్పుడు తనకు చిన్న వయస్సు కావడం వల్ల ఏం జరిగిందో, ఎందుకు జరిగిందో, దాని పరిణామాలు ఏమిటో తనకు తెలియదని అన్నారు. పార్టీ ఒక నిర్ణయం తీసుకుందని, అది కేవలం ఒక వ్యక్తి తీసుకున్నది కాదని, కార్యకర్తలు అందరూ కలిసి తీసుకున్న నిర్ణయమని, ప్రజాస్వామ్యంలో ఇలాంటివి సహజమని ఆయన అభిప్రాయపడ్డారు. మనం ఏం చేయలేం.. అలాంటి పరిస్థితి వచ్చేసింది అని తన నిస్సహాయతను వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తనకు విషయాలు తెలిస్తే తప్పకుండా మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూ ద్వారా జూనియర్ ఎన్టీఆర్ తన కుటుంబ బంధాలను, రాజకీయ నిబద్ధతను, భవిష్యత్తుపై తన దృక్పథాన్ని తెలుగు ప్రజలకు స్పష్టంగా తెలియజేశారు.

# ఏందీ అమ్మడు.. ఇది నువ్వేనా..?



సాంప్రదాయ కట్టులో వెస్ట్రన్ గ్లామర్ జోడించినట్లు ఉన్న ఈ లుక్ అందరినీ ఆకట్టుకుంటోంది. సాధారణంగానే కలర్ దుస్తుల్లో ఎవరైనా సరే చాలా ప్రత్యేకంగా కనిపిస్తారు. ఇక ప్రణవి మానుకొండ విషయానికి వస్తే, ఆమె ఎంపిక చేసిన ఈ నల్లటి శారీ ఆమె స్కిన్ టోన్‌కు పర్ఫెక్ట్‌గా సూట్ అయింది. దీనికి తోడుగా ఆమె పెట్టుకున్న పొడవాటి జుంకాలు, చేతికి వేసుకున్న గాజులు ఈ లుక్‌కు అదనపు ఆకర్షణగా నిలిచాయి. చిరునవ్వులు చిందిస్తూ ఆమె ఇచ్చిన పోజులు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. ఆమె అభిమానులు, నెటిజన్లు లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. "బ్లాక్ శారీలో తెలుగు అందం అద్భుతంగా ఉంది", "అచ్చమైన తెలుగింటి ఆడపిల్లలా మెరిసిపోతున్నావు", "సింప్లిసిటీకి కేరాఫ్ అడ్రస్" అంటూ కామెంట్ల రూపంలో ప్రశంసలు గుప్పిస్తున్నారు. గ్లామర్ డోస్ పెంచినప్పటికీ, ఎక్కడా శృతిమించకుండా ఎంతో హుందాగా ఈ ఫొటోషూట్ ఉండటంతో అందరి నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. ప్రణవి మానుకొండ తెలుగు ప్రేక్షకులకు కొత్తేమీ కాదు. చిన్నప్పటి నుంచే పలు సీరియల్స్, సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా యూట్యూబ్‌లో వచ్చిన పలు షార్ట్ ఫిలిమ్స్, వెబ్ సిరీస్‌ల ద్వారా యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది. రీసెంట్‌గా వెండితెరపై కూడా హీరోయిన్‌గా అడుగుపెట్టి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. కేవలం నటనతోనే కాకుండా, ఇలాంటి ట్రెండీ మరియు సాంప్రదాయ ఫొటోషూట్‌లతో ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తూ తన ఫాలోయింగ్‌ను పెంచుకుంటోంది. రాబోయే రోజుల్లో ఈ ముద్దుగుమ్మకు మరిన్ని సినిమా అవకాశాలు రావాలని, టాలీవుడ్‌లో మంచి హీరోయిన్‌గా స్థిరపడాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. రాజ్ తరుణ్, అవికా గోర్ కలిసి నటించిన ఉయ్యాలా జంపాలా' (2013) సినిమాలో చైల్డ్ ఆర్టిస్టుగా కనిపించింది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com**, **www.jayabheridaily.com**